


www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 01 మంగళవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 286
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Gunturr,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# రసాయన పరిశ్రమలో విస్ఫోటనం

## 19 మంది దుర్మరణం..50 మందికి తీవ్రగాయాలు



మరో 15 మంది కార్మికులు గల్లంతు
కాలిన తీవ్ర గాయాలతో 30 మంది ఆస్పత్రిలో..
వారిలో 16 మంది పరిస్థితి విషమం
పాశమైలారం పారిశ్రామికవాడలో ఘోరం
డ్రయ్యర్ పేలడంతో ఎగిసిన అగ్నికీలలు.. 2 కిలోమీటర్ల మేర కంపించిన భూమి
కుప్పకూలిన పరిశ్రమ గెస్ట్ హౌస్.. అందులో ఉన్న జనరల్ మేనేజర్ మృతి
పేలుడు సమయంలో విధుల్లో 155 మంది..
ముద్దలుగా మృతదేహాలు
డీఎన్ఏ పరీక్షలకు చర్యలు.. రంగంలోకి దిగిన హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ బృందాలు
మృతులు, క్షతగాత్రులు బిహార్, ఒడిసా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాసులు
ఘటనాస్థలిని సందర్శించిన మంత్రులు దామోదర, వివేక్, మాజీ మంత్రి హరీశ్
సీఎస్ నేతృత్వంలో విచారణ కమిటీ..
ఘటనపై సీఎం దిగ్భ్రాంతి.. నేడు సందర్శన

**పటాన్‌చెరు-నవభూమిప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సిగాచి రసాయన పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, 19 మంది దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి, ముద్దలుగా కనిపించాయి. అగ్నికీలలు, పేలుడు ధాటికి పక్కనే ఉన్న భవనం కూలిపోవడం, పార్క్ చేసిన వాహనాలకు నిప్పంటుకోవడంతో.. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇంకో 15 మంది కార్మికులు గల్లంతైనట్లు సమాచారం. రాత్రి కడపటి వార్తలందేసరికి కూడా పరిశ్రమలో శిథిలాల వెలికితీత కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదాలున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఎయిర్‌వాక్స్ పేలినట్లు పేర్కొన్నారు. సాయంత్రానికి అది డయ్యర్ పేలుడు అయ్యి ఉండొచ్చని, రియాక్టర్ కాకపోవచ్చని వెల్లడించారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారంలో కొనసాగుతున్న సిగాచి పరిశ్రమలో.. ఉదయం షిఫ్ట్‌లో 6 గంటలకు పలువురు కార్మికులు విధులకు హాజరయ్యారు. జనరల్ షిఫ్ట్‌లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి పలువురు కార్మికులు, సూపర్‌వైజర్లు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, అధికారులు లోనికి వచ్చారు. సరిగ్గా 9.10 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతతో 2 కిలోమీటర్ల వరకు భూమి కంపించింది.

భారీ శబ్దం వినబడింది. పరిసర పరిశ్రమల్లోని



కార్మికులు భూకంపం వచ్చిందంటూ బయటకు పరుగులు పెట్టారు. రోడ్డుపైన, పరిశ్రమల్లో పార్క్ చేసిన పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమలో 155 మంది ఉన్నారని సమాచారం. ఈ ప్రమాదంలో హాజరు రికార్డు కూడా బుగ్గిపాలైందని తెలిసింది. పేలుడు సంభవించగానే.. అగ్నికీలలు వేగంగా వ్యాప్తిచెందాయి. పరిశ్రమలోని పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు సైతం నిప్పంటుకోవడాన్ని బట్టి, తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆ వెంటనే పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. దీంతో అక్కడున్నవారికి ఏం జరిగింది? ఏం జరుగుతోంది? అనేది అర్థం కాలేదు. లోపల



బాధితుల హాహాకారాలతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లుతున్నా.. లోనికి వెళ్లలేనంతగా పొగ వ్యాప్తి చెందింది. దీంతో స్థానికులు డయల్-100కు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. స్థానిక

# తెలంగాణ బీజేపీ చీఫ్‌గా రాంచందర్‌రావు

- అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డ అర్వింద్, ఈటల తదితరులు
- రాంచందర్‌వైపు అధిష్టానం మొగ్గు.ఆరెస్సెస్ ఒత్తిడి
- బీజేవైఎం, ఆరెస్సెస్ పట్ల రాంచందర్ రావు అంకితభావం
- క్షేత్ర స్థాయిలో బలమైన సంబంధాలు
- అధినాయకత్వానికి నమ్మకస్తుడు
- తెలంగాణ బీజేపీ రాజకీయాల పట్ల ఆచితూచి వ్యూహం
- వచ్చే ఎన్నికల దృష్ట్యా కొత్త అధ్యక్షుడి ఎంపిక

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరో తెలిసిపోయింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్థానంలో ఎన్. రాంచందర్ రావు తెలంగాణలో కమల దళానికి సారథిగా నియమితులు కానున్నారు. అధ్యక్ష పదవి కోసం రాంచందర్ రావు ఒక్కరే నామినేషన్ వేస్తుండటంతో.. పార్టీ చీఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టడం ఇక లాంఛనమే. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం రాంచందర్ రావుతోపాటు బీసీ సామాజికవర్గానికి చెందిన ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ పేర్లు బలంగా వినిపించాయి. అయితే చివరకు అధిష్టానం రాంచందర్ రావు వైపు మొగ్గింది.

కిషన్ రెడ్డి కంటే ముందు తెలంగాణ అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్ వ్యవహరించారు. ఆయన నాయకత్వంలో పార్టీ తెలంగాణలో బాగా పుంజుకుంది. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్యంగా ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఎక్కువ కావడంతో.. మరోసారి బీసీ నేతకే పార్టీ పగ్గాలు అప్పగిస్తారని చాలా మంది భావించారు. కానీ ఆరెస్సెస్ అండదండలు పుష్కలంగా ఉన్న రాంచందర్ రావును ఆ పదవి వరించింది. ఏపీలోనూ

# ఏపీ బీజేపీ సారథి పీవీఎన్ మాధవ్

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మాధవ్
- గతంలో శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా మాధవ్
- సుదీర్ఘ కాలం నుంచి బీజేపీలోనే ఉంటూ వస్తున్న మాధవ్‌ను ఎంపిక ద్వారా కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తుందన్న సంకేతాలు



**అమరావతి-నవభూమిబ్యూరో**

నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ పేరు ఖరారైంది. ప్రస్తుతం నామినేషన్ వేసేందుకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి మాధవ్ వెళ్లారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవ్ ఉన్నారు. గతంలో శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా మాధవ్ పనిచేశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. అధిష్ఠానం ఖరారు చేసిన వ్యక్తి నామినేషన్ దాఖలు చేయనున్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపీ మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు.

భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షునిగా పోకల వంశీ నాగేంద్ర మాధవ్ మాధవ్ ఖరారయ్యారు. ఇప్పటికే ఈ పదవి కోసం అనేక మంది ఆశావహులు తమవంతుగా తమకు అధిష్టానంతో ఉన్న పరిచయాలతో ప్రయత్నాలు చేశారు. పార్టీ అధిష్టానం అధ్యక్ష మార్పు చేయకపోతే ప్రస్తుత అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కొనసాగుతారని అంతా అంచనా వేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు సోము వీర్రాజు, NYK మాజీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధనరెడ్డితోపాటు పలువురి పేర్లు ప్రచారం జరిగాయి. చివరికి పీవీఎన్ మాధవ్ పేరును ఖరారు చేస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

సుదీర్ఘ కాలం నుంచి బీజేపీలోనే ఉంటూ వస్తున్న

# బనకచర్లకు అనుమతి ఇవ్వలేం

- కేంద్ర పర్యావరణ నిపుణుల మదింపు కమిటీ స్పష్టీకరణ
- కేంద్ర జల సంఘం సహాయంతో వరద నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయాలి
- 1980కి విరుద్ధంగా ఉందన్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలి: నిపుణుల కమిటీ సూచనలివే..
- టీఓఆర్ తయారీకి ముందు రాష్ట్రాల మధ్య జల పంపిణీపై క్లారిటీ కోసం కేంద్ర జల కమిషన్ అనుమతి తప్పనిసరి

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌కు ప్రస్తుత దశలో పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల మదింపు కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్ట్‌పై పలు సందేహాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్ట్‌కు ఇప్పుడే అనుమతులు ఇవ్వలేమని తెల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ నిపుణుల మదింపు కమిటీ వెనక్కి పంపింది. అంతే కాకుండా మూడు కీలక సూచనలు చేసింది.

ప్రాజెక్టు ప్రతిపాదకులు కేంద్ర జల సంఘం సహాయంతో వరద నీటి లభ్యతపై

# వైసీపీ మాజీ ఎంపీ సురేశ్‌కు ఎట్టకేలకు బెయిల్

- గుంటూరు జిల్లా కోర్టు నందిగం బెయిల్ మంజూరు
- టీడీపీ కార్యకర్త రాజుపై దాడి కేసులో సురేష్ అరెస్టు



2

**గుంటూరు-నవభూమిబ్యూరో**

వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఎట్టకేలకు బెయిల్ వచ్చింది. గుంటూరు జిల్లా కోర్టు నందిగంకు బెయిల్ మంజూరు చేసింది. టిడిపి కార్యకర్త ఇసుక పల్లి రాజుపై దాడి కేసులో అరెస్ట్ అయిన సురేష్, ఇప్పటి వరకూ రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఎట్టకేలకు బెయిల్ వచ్చింది. గుంటూరు జిల్లా కోర్టు నందిగం కు బెయిల్ మంజూరు చేసింది. టిడిపి కార్యకర్త ఇసుక పల్లి రాజుపై దాడి కేసులో అరెస్ట్ అయిన సురేష్, గుంటూరు జిల్లా జైలులో ఇప్పటి వరకూ రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్, అతని సోదరుడు నందిగం వెంకట్‌తో కలిసి ఇటీవల తన స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్ధండరాయుని పాలెంలో టీడీపీ కార్యకర్తపై తీవ్ర స్థాయిలో దాడికి దిగారు. ఈ దాడిలో ఇసుకపల్లి కృష్ణ అలియాస్ రాజుని తీవ్రంగా గాయపరిచారు.

అంతేకాదు, తీవ్రంగా గాయపడ్డ రాజును అంతటితో వదిలేయకుండా ఇంటికి తీసుకువెళ్లి బంధించారు. ఇక, ఇంటి వద్ద సురేశ్ భార్య బేబి, తదితరులు కూడా రాజుని రాళ్లు, కర్రలతో తీవ్రంగా కొట్టారు. దీంతో రాజు భార్య చేసిన ఫిర్యాదు మేరకు నందిగం సురేష్‌ను పోలీసులు అరెస్ట్

# ఏపీ లిక్కర్ స్కాం కేసులో చెవిరెడ్డికి షాక్!

- లిక్కర్ స్కాం కేసులో మరో ఇద్దరు బాలాజీ,నవీన్ అరెస్ట్
- చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు బాలాజీ అరెస్ట్
- చెవిరెడ్డితో పాటు నిందితుడు వెంకటేశ్‌కు పోలీసు కస్టడీ
- చెవిరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డికి బెయిల్ తిరస్కరణ



**చిత్తూరు-నవభూమిబ్యూరో**

ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఏపీకి రూ. 8.20 కోట్లు తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు బాలాజీని సిట్ పోలీసులు ఇండోర్‌లో అదుపులోకి తీసుకున్నారు. బాలాజీ లొకేషన్ ఆధారంగా అక్కడికి వెళ్లిన సిట్ బృందం, అతడిని అదుపులోకి తీసుకుని, తనతో పాటు మరో నిందితుడు నవీన్‌ను కూడా అరెస్ట్ చేసింది. వీరిద్దరినీ ప్రస్తుతం విజయవాడకు తరలిస్తున్నారు.

అంతే కాకుండా ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మరో నిందితుడు వెంకటేశ్ నాయుడును మూడు రోజుల పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వీరిద్దరినీ


## మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం



త్రిభాషా విధానంపై యూటర్న్
ఒకటి నుంచి 5 వరకు హిందీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు

3

## రూ.18 కోట్లు మటాష్!



3 సార్లు ప్లాన్లు గీసి.. 90డిగ్రీల బ్రిడ్జ్ కట్టారు..
ఏడుగురు ఇంజినీర్లు సస్పెండ్..

5

## భారతీయులకు శుభవార్త..

వారికి శాశ్వత నివాసంపై కెనడా కీలక నిర్ణయం



5

## రాజాసింగ్ సంచలన నిర్ణయం..



అయ్యా మీకో దండం... మీ పార్టీకో దండం

2

## ప్రధాని మోదీ 5 దేశాల పర్యటన ఖరారు



జులై 2,3 తేదీల్లో ఘనాలో ప్రధాని పర్యటన

2

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం



లోతట్టు ప్రాంతాలు జలమయం

7




నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2
హైదరాబాద్
మంగళవారం
01 । జులై 2025



# కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్

**నవ వార్త**



**హైదరాబాద్-నవభూమి** కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ ఫైర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోదీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జులై 4నఎల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## స్వేచ్ఛ నా భర్తను బ్లాక్‌మెయిల్ చేసేది.. పూర్ణచందర్ భార్య సంచలన వీడియో



**హైదరాబాద్-నవభూమి;** న్యూస్ ఛానల్ యాంకర్ ఆత్మహత్య కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. తన కూతురి చావుకి పూర్ణ చందర్ కారణం అంటూ యాంకర్ తల్లిదండ్రులు ఆరోపించారు. ఆ తర్వాత పూర్ణ చందర్ లేఖ విడుదల చేయగా, ఇందులో యాంకర్ ఆమె తల్లిదండ్రుల వలన మానసిక ఆవేదన చెంది సూసైడ్ చేసుకుందని ఉంది. ఇక మధ్యలో ఎంట్రీ ఇచ్చిన యాంకర్ కూతురు తన పట్ల పూర్ణ చందర్ అసభ్యంగా ప్రవర్తించేవాడని ఫిర్యాదు చేసింది. దాంతో పోక్సో కేసు పెట్టి పూర్ణ చందర్‌ని అరెస్ట్ చేశారు. అయితే పూర్ణ చందర్ మాత్రం తన లేఖలో ఆ యాంకర్ కుమార్తెను తన కన్న కూతురిలా చూసుకున్నానని..స్కూల్లో చేర్పించి ఫీజులు కడుతున్నానని పేర్కొన్నాడు.

ఆమె కూతురు ఫంక్షన్ కోసం తాను ఐదు లక్షలు ఖర్చు పెట్టానని కూడా అన్నాడు.. కానీ ఆ అమ్మాయి వర్షెన్ మాత్రం భిన్నంగా ఉంది. పూర్ణచందర్ ప్రవర్తన ఏ మాత్రం బాగా ఉండేది కాదని మీడియాకు చెప్పుకొచ్చింది. ఇక ఇదే సమయంలో పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. పూర్ణ చందర్ ద్వారానే ఆ న్యూస్ యాంకర్ తనకు పరిచయం అయిందని, ముందు వారిద్దరి మధ్య సంబంధం గురించి తనకు తెలియదని, ఎప్పుడైతే వారి వ్యవహారం తెలిసిందో అప్పుడే పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. అయితే పూర్ణచందర్‌పై యాంకర్ కూతురు చేస్తున్న ఆరోపణలు పూర్తి అసత్యమని, అమెను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న స్పష్టం చేసింది. న్యూస్ యాంకర్ నన్ను మానసికంగా ఎంతో టార్చర్ చేసిందని, పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని బయపెట్టిందని స్వప్న స్పష్టం చేసింది. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడంటూ స్వప్న కామెంట్ చేయడం గమనర్హం. అయితే ఆ న్యూస్ యాంకర్ చనిపోయే ముందు ఎలాంటి సూసైడ్ నోట్ రాయలేదు. దాంతో పూర్ణచందర్ ను పోలీసులు అరెస్టు చేయలేకపోయారు. కానీ అనూహ్యంగా యాంకర్ కుమార్తె తనపై వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. కుమార్తె ఫిర్యాదుతో పెద్ద చిక్కుల్లోనే పడ్డాడు పూర్ణ చందర్. స్వేచ్ఛ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరిశీలనలో అనుమానాస్పద అంశాలు ఏమైనా బయటపడితే.. అవి సంచలనంగా మారే అవకాశాలు ఉన్నాయి.

## బిహార్ ఎన్నికల్లో మహా కూటమితో కలిసి మజ్లిస్ పోటీ..



**హైదరాబాద్-నవభూమి** బీజేపీ, ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు బిహార్ అసెంబ్లీకి ఈఏడాది చివరలో జరిగే ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి మహా కూటమి(మహా ఘట్బంధన్) నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ(తెలిపారు. ఈసారిఎన్నికల్లో ఎన్‌డీఏను గద్దె దించే లక్ష్యంతో బిహార్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్‌ప్రణాళిక రూ పొందిస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ, ఎన్‌డీఏలను నియంత్రించేందుకు ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీతో కూడిన మహాకూటమితో కలిసి పోటీ చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. క్రియాశీల కార్యకర్తల బలం ఉన్న సీమాంచల్‌లో మజ్లిస్ పోటీ చేస్తోందని తెలిపారు. మహా కూటమి పార్టీలు ఎన్నికల్లో తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఒవైసీ స్పష్టం చేశారు.

ఐదేళ్ల క్రితం బీజేపీ ఎన్‌డీఏను నియంత్రించేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని గుర్తు చేశారు. బిహార్ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరిట ఓటర్ల జాబితా సవరణ తీరుపై ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశా రు. సీమాంచల్ లాంటి ప్రాంతాల్లో వరద ముంపుతో అక్కడి నిరుపేదల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వలస వెళ్తారన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట బర్త్ సర్టిఫికెట్, నివాస ధృవీకరణతో పాటు తలిదండ్రుల నివాస ధృవీకరణ పత్రాలు చూపాలంటే నిరుపేదలు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు. దీంతో వేలాది మంది నిరుపేదల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చక పోవచ్చని, నిరుపేదలు ఓటుహక్కు పొందలేరని ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు.

## నక్సలైట్లను చంపగలరేమో.. నక్సలిజాన్ని చంపలేరు : సీపీఐ నారాయణ

**హైదరాబాద్-నవభూమి** నక్సలైట్లతో చర్చలు ఉండవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిజామాబాద్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమోగానీ నక్సలిజాన్ని అంతం చేయలేరని అన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా నక్సలిజాన్ని అంతం చేస్తామన్న అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవాచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా పర్యటలో భాగంగా మాట్లాడిన అమిత్ షా నక్సలైట్లు తక్షణమే హింసను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. నక్సలైట్లు గిరిజన బిడ్డలను, పోలీసులను చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదు గానీ.. ఇప్పుడు చర్చల కోసం చాలామంది పిలుపునిస్తున్నారని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారన్నారు. ఆయుధాలు వీడేదాక వారితో చర్చలు ఉండవని అమిత్ షా అన్నారు. ఈ నేపథ్యంలో నారాయణ స్పందించారు.

## భారీగా ఎయిర్ ట్రాఫిక్.. హైదరాబాద్‌లో దిగాల్సిన విమానం విజయవాడకు

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో దిగాల్సిన ఇండిగో విమానాన్ని ఎయిర్ ట్రాఫిక్ కారణంగా విజయవాడకు మళ్లించారు. గంటా 20 నిమిషాల్లో గమ్యాస్థానికి చేరుకోవాల్సిన విమానం మూడు గంటలు ఆల్యంగా వచ్చింది. ఇండిగో 6%E%-6473 విమానం పుణె నుంచి హైదరాబాద్‌కు వస్తున్నది. ఆదివారం ఉదయం 8.43 గంటలకు పుణె విమానాశ్రయం నుంచి బయల్దేరింది. ఉదయం 10 .03 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. అయితే హైదరాబాద్ గగణతలంలో భారీగా ఎయిర్ ట్రాఫిక్ ఉండటంతో ల్యాండింగ్ కుదరలేదు. దీంతో విమానాన్ని విజయవాడకు మళ్లించారు. రెండు గంటల తర్వాత అంటే మధ్యాహ్నం 12.38 గంటలకు శంషాబాద్‌కు చేరుకుంది. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

### రాజాసింగ్ సంచలన నిర్ణయం..

# బీజేపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా



**హైదరాబాద్-నవభూమి** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అందించినట్లు చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసేందుకు వెళితే.. తన అనుచరులను బెదిరించినట్లు రాజాసింగ్ మీడియా ముందు వాపోయారు. పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే 10 మంది మద్దతు అవసరమని.. తనకు మద్దతు ఇస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని తమ అనుచరులను పార్టీ ముఖ్యనేతలు బెదిరించారని చెప్పారు. బీజేపీ ముఖ్య నేతల తీరుతో తాను కలత చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాను బీజేపీ ఎమ్మెల్యేగా కమలం గుర్తుపై గెలిచినందున ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని.. ఆ లేఖను కిషన్ రెడ్డి గారే స్వయంగా స్పీకర్‌కు పంపపాలని కోరారు. పార్టీ అధ్యక్షుడి ఎంపిక ముందుగానే పూర్తయిందని.. పార్టీ ఓడిపోవాలని కోరుకునేవారు బీజేపీలోనే ఎక్కువ ఉన్నారని రాజాసింగ్ సంచలన కామెంట్స్ చేశారు. కాగా, బీజేపీ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచదర్‌రావు పేరు దాదాపు ఖరారైంది. దీనిపై రాజాసింగ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇవాళ మధ్యాహ్నమే ఓ వీడియో రిలీజ్ చేశారు. పార్టీలో బూతు స్థాయి నుంచి కీలక నేతల వరకు అందరూ కలిసి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఏక పక్షంగా అధ్యక్షుడిని ఎంపిక చేయటం సరైన నిర్ణయం కాదని అన్నారు. అయితే ఆయన గతంలోనూ పలుమార్లు పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాజీనామా చేస్తానని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుల నియామకంపైనా రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి నియామకం విషయంలో పార్టీ తన సూచనలను పట్టించుకోలేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను వెనుకబడిన తరగతులు లేదా షెడ్యూల్డ్ కులాలు చెందిన వ్యక్తిని నియమించాలని కోరితే తనన సూచనను పట్టించుకోలేదన్నారు. పార్టీలో కొంతమంది నేతల నుంచి తనకు వేధింపులు ఎదురవుతున్నాయని.. బ్రోకరిజం జరుగుతోందని రాజాసింగ్ సన్నిహితుల వద్ద వాపోయినట్లు వార్తలు వచ్చాయి. రాజాసింగ్ బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై పదే పదే విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ రాష్ట్ర నాయకత్వం వారికి తొత్తులుగా మారిందని కూడా ఆరోపించారు. తాను హిందూ ధర్మ రక్షణ, గోరక్షణ వంటి అంశాలపైనే దృష్టి సారించాలనుకుంటున్నానని అన్నారు. తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, పార్టీ లైన్‌కు భిన్నంగా మాట్లాడటం వంటివి చేయడం వల్ల గతంలో పార్టీ నుంచి ఆయన సస్పెండ్‌కు గురయ్యారు. ఆ తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయగా.. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషాహమల్ నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తాజాగా తానే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించం రాష్ట్ర రాజకీయాల్లో వేడిని రాజేసింది. రాజాసింగ్ వ్యవహారం బీజేపీలో ఎలాంటి మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

# ఇంజక్షన్ తీసుకోవడం వల్లే నటి షెఫాలీ మృతి

**వివరాలు వెల్లడించిన పోలీసులు**

**ముంబై-నవభూమి:** ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా మరణంపై వస్తున్న ఊహాగానాల మధ్య పోలీసులు కీలక సమాచారం వెల్లడించారు. ఈ నెల 27న రాత్రి షెఫాలీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మరణానికి ముందు జరిగిన పరిణామాలపై పోలీసులు విచారణ జరిపారు.

ప్రముఖ నటి షెఫాలీ జరీవాలా మరణంపై వస్తున్న ఊహాగానాల మధ్య పోలీసులు కీలక సమాచారం వెల్లడించారు. ఈ నెల 27న రాత్రి షెఫాలీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మరణానికి ముందు జరిగిన పరిణామాలపై పోలీసులు విచారణ జరిపారు. సోమవారం (జూన్ 30న) ఆమె మృతికి సంబంధించి పలు వివరాలను వెల్డించారు. ఆమె యవ్వనంగా ఉండేందుకు పలు మాత్రలతో పాటు ఇంజెక్షన్ తీసుకుంటూ వచ్చారన్నారు. జూన్ 27న ఇంట్లో పూజ సందర్భంగా ఉపవాసం ఉన్నారని.. కడుపు ఖాళీగా ఉండగా మందులు తీసుకోవడం బీపీ పడిపోయిందని ఉండవచ్చని.. దాంతో ఒక్కసారిగా సొమ్మసిలిపడిపోయారని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం ఆమె యవ్వనాన్ని కాపాడుకునేందుకు ఇంజెక్షన్ వేసుకున్నట్టు తెలుస్తోందన్నారు. రాత్రి కూడా ఆమె సాధారణంగా తీసుకునే టాబ్లెట్లు తీసుకున్నట్టు సమాచారం ఉందన్నారు. బీపీ తీవ్రంగా పడిపోవడంతో ఆమె శరీరం కంపించిందని, వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను అంధేరిలోని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కి రాత్రి 11.15కి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు ప్రకటించారని పోలీసులు తెలిపారు. రాత్రి 1 గంటకు పోలీసులకు సమాచారం అందగా.. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కూపర్ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఇప్పటివరకు ఆమె భర్త పారాగ్ త్యాగి, తల్లిదండ్రులు, ఇంటి పనిమనిషి సహా 10 మంది వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేసినట్టు అంబోలి పోలీసులు తెలిపారు. ఇంటిలో ఉన్న ఔషధాలు, ఇంజెక్షన్లను సేకరించేందుకు ఫోరెన్సిక్ బృందంతో కలిసి పోలీసు బృందం ఇంటికి వెళ్లింది. ప్రస్తుతం షెఫాలీ మరణాన్ని ప్రమాదవశాత్తు జరిగిన మృతిగా నమోదు చేశారు. పూర్తి వివరాలకు పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురు చూస్తున్నట్టు పోలీసులు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఏవైనా అనుమానాస్పద విషయాలు వెల్లడికాలేదని వివరించారు.

# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. హఠాత్తుగా భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, షేక్ పేట్, గోల్కొండ, టోలీచౌకి, రాజేంద్రనగర్, బండ్లగూడ, నార్సింగి, మణికొండ, ఎర్రగడ్డ, పంజాగుట్ట, శివమ్ రోడ్, ఖైరతాబాద్, చందానగర్, %దీఎజూ%, గచ్చిబౌలి, మియాపూర్, మెహిదీపట్నం, వెంకటగిరి, యూసుఫ్‌గూడ సహా మరిన్ని ప్రాంతాల్లో వర్షం జోరుగా కురుస్తోంది. హైదరాబాద్‌తో పాటు నిర్మల్, ఆదిలాబాద్, నారాయణపేట్ జిల్లాల్లోనూ వాన దంచికొడుతోంది.

నైరుతి రుతుపవనాలు ఇప్పటికే దేశమంతటా విస్తరించాయి. అరేబియా, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాల కారణంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా తెలంగాణలోని 19 జిల్లాలు, ఏపీలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, అల్లూరి, మన్యం జిల్లాలు సహా పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షం కురిసే అవకాశముందని ఓ నివేదికలో పేర్కొంది. సముద్ర తీరం వెంబడి 40-50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.

# రాజాసింగ్‌పై అధిష్టానం గుస్సా

**హైదరాబాద్-నవభూమి:** బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహారశైలిపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఆయన రాజీనామాను ఆమోదించడం లేదా పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే రాజాసింగ్.. తొలు తాను పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించారు. అందుకు ప్రెస్ మీట్ పెట్టేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఆ విషయాన్ని వెంటనే పార్టీ అగ్రనాయకత్వానికి పార్టీలోని కీలక నేతలు తెలియజేశారు. దీంతో బీజేపీ కీలక నేతలు సునీల్ బన్సాల్, అభయ్ పాటిల్ రంగంలోకి దిగి.. రాజాసింగ్‌ను బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది.

కానీ రాజాసింగ్ వివరణతోపాటు ఆయన చేసిన వ్యాఖ్యలపై వారు సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జాతీయ నాయకత్వానికి రాజసింగ్ రాజీనామా లేఖను రాష్ట్ర నాయకత్వం పంపినట్లు తెలుస్తుంది. ఇక అధ్యక్ష ఎన్నికల వేళ.. అతని నామినేషన్ అడ్డుకోవాలనుకుంటే.. నామినేషన్ పత్రాలను రాజాసింగ్‌కు తాము ఎందుకు ఇస్తామని ఈ సందర్భంగా వారు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బీజేపీ ప్రతినిధులు అధికార ప్రకటన చేయనున్నట్లు తెలుస్తుంది.

**రాజాసింగ్ రాజీనామా.. బీజేపీ ఎమ్మెల్యే రియాక్షన్**

రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక పార్టీ నియమావళి ప్రకారం జరుగుతుందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వెల్లడించారు. ఈ ఎన్నిక ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతోందని తెలిపారు. అధ్యక్ష పదవికి అర్హులుగా ఉన్నవారికి మాత్రమే నామినేషన్ వేయడానికి పార్టీ అవకాశం ఇచ్చిందని వివరించారు. ఎన్నిక ప్రక్రియలో ఏ లోపం లేకుండా దీనిని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పది మంది సభ్యులు ప్రతిపాదించిన తర్వాత నామినేషన్ వేస్తారని వివరణ ఇచ్చారు. అయితే రాష్ట్ర అధ్యక్ష ఎన్నికపై మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు.

బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ స్పందిస్తూ..రాజా సింగ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఆయన క్రమశిక్షణ రాహిత్యం పరాకాష్ట చేరిందంటూ రాజాసింగ్‌పై మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే.. అసెంబ్లీ స్పీకర్‌కు అందుకు సంబంధించిన లేఖను అందజేయాలని వివరించారు. బీజేపీకి వ్యక్తుల కంటే పార్టీనే ముఖ్యమని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షులకు ఇచ్చిన రాజీనామా లేఖను జాతీయ అధ్యక్షుడికి పంపిస్తున్నామని రాణి రుద్రమ వివరించారు.

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు సోమవారం నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. అందులోభాగంగా రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేశారు. అయితే రాజా సింగ్ సైతం నామినేషన్ వేసేందుకు బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనుచరులుతో వచ్చిన ఆయన్ని కార్యాలయంలోకి అనుమతించ లేదు. దీంతో తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను అధ్యక్ష పదవి నామినేషన్ వేసేందుకు వెళ్లితే.. అడ్డగించారని ఆరోపించారు. అంతేకాకుండా.. తన అనుచరులను సైతం భయపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి రాకుండా చేసేందుకు పెద్ద నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

## పాశమైలారంలో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత.. భారీగా పోలీసులు మోహరింపు

**సంగారెడ్డి-నవభూమి:** పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి 12 మంది మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమ వారి ఆచూకీ తెలపాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని పరిశ్రమలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కుటుంబసభ్యుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కాగా, ఘటనా స్థలి వద్ద కుటుంబాల రోదనలు మిన్నంటాయి. మరోవైపు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. అయితే గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిపరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించి మంటలు ఎగసిపడ్డాయి.

## వైసీపీ మాజీ ఎంపీ సురేశ్‌కు ఎట్టకేలకు బెయిల్

(1వపేజీ తరువాయి) చేసి కేసు నమోదు చేశారు. అనంతరం సురేష్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. దీంతో ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జిల్లా కోర్టు ఇవాళ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో చెవిరెడ్డికి షాక్!

(1వపేజీ తరువాయి)పోలీసులు ప్రశ్నించనున్నారు. ముందుగా విధించిన రిమాండ్ గడువు ముగియనున్న నేపథ్యంలో కోర్టు ఈ కస్టడీని మంజూరు చేసింది.

**మోహిత్ రెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరణ..**

ఇక కేసులో 39వ నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఏసీబీ కోర్టు దానిని తిరస్కరించింది. లిక్కర్ స్కాం దర్యాప్తులో సిట్ అంతర్రాష్ట్ర స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా దృష్టి పెట్టింది. ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా, విదేశాల్లో ఉన్న లింక్‌లపై దృష్టిసారించింది. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు వారిని కోర్టు అనుమతితో విచారించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిందితుల స్టేట్‌మెంట్లు, ఫైనాన్షియల్ లింకులు, విత్‌డ్రాయల్స్, రాజకీయ సంబంధాలు అన్నింటినీ విశ్లేషిస్తున్న సిట్, వివిధ కోణాల్లో ఆధారాలు సేకరిస్తోంది. రానున్న రోజుల్లో ఈ స్కాంలో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## ఏపీ బీజేపీ సారధి పీవీఎన్ మాధవ్

(1వపేజీ తరువాయి)మాదవ్‌ను ఎంపిక చేయడం ద్వారా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుందన్నది అధిష్టానం ఆలోచనగా కనిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గాల నుండి శాసన మండలి సభ్యునిగా మాధవ్ పనిచేశారు. 1973 ఆగస్టు 10న జన్మించిన మాధవ్ తల్లిదండ్రులు పీవీ చలపతిరావు, రాధాచలపతి. గుడిలోవ విజ్ఞాన విహార్, శ్రీ కృష్ణ విద్యా మందిర్, డాక్టర్ వీఎస్ కృష్ణ కాలేజ్‌లలో విద్యాభ్యాసం చేశారు. బీకాం చేస్తూనే కాస్ట్ అకౌంటెంట్ పూర్తి చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి MBAలో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. అదే సమయంలో PGDCS, PGDASలు పూర్తి చేశారు. చిన్న తనంలోనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో స్వయం సేవక్‌గా చేరారు. ఆర్ఎస్ఎస్ విశాఖ నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా సేవలందించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. విభిన్న సామాజిక, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. స్వదేశీ దేశీ జాగరణ్ మంచ్‌లో పూర్తికాలం కార్యకర్తగా చేరి దేశమంతా పర్యటించారు.

## బనకచర్లకు అనుమతి ఇవ్వలేం

(1వపేజీ తరువాయి)సమగ్ర అధ్యయనం చేయాలి. Godavari Water Disputes Tribunal Award 1980కి విరుద్ధంగా ఉందన్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలి.

TOR తయారీకి ముందు రాష్ట్రాల మధ్య జల పంపిణీపై క్లారిటీ కోసం కేంద్ర జల కమిషన్ అనుమతి తీసుకోవాలి.

సముద్రంలో కలిసే గోదావరి నది మిగుల జలాలను మళ్లించి.. రాయలసీమ జిల్లాలకు అందించాలని చంద్రబాబు ప్రభుత్వం భావించింది. అందుకోసం బనకచర్ల ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అయితే ఏపీ చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తమ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ తెలంగాణలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆ క్రమంలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశాయి. పలువురి అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. అనంతరం ఈ వ్యవహారంపై కేంద్ర జలశక్తితోపాటు పలు శాఖల మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు.

## ప్రధాని మోదీ 5 దేశాల పర్యటన

**న్యూదిల్లీ-నవభూమి:** పర్యటనలో భాగంగా తొలుత జూలై 2,3 తేదీల్లో ఘనాలో ప్రధాని పర్యటిస్తారు. మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే మొదటిసారి. వ్యవసాయం, వ్యాక్సిన్ డవలప్‌మెంట్, ఘనాలో వ్యాక్సిన్ హబ్ ఏర్పాటు, రక్షణ రంగంలో సహకారం వంటివి ప్రధానంగా చర్చిస్తారు. న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. జూలై 2 నుంచి ఎనిమిది రోజుల పాటు ఆయన పర్యటన సాగుతుంది. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ప్రధానమంత్రి పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ లోని ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపారు. పర్యటనలో భాగంగా తొలుత జూలై 2,3 తేదీల్లో ఘనాలో ప్రధాని పర్యటిస్తారు. మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే మొదటిసారి. వ్యవసాయం, వ్యాక్సిస్ డవలప్‌మెంట్, ఘనాలో వ్యాక్సిన్ హబ్ ఏర్పాటు, రక్షణ రంగంలో సహకారం వంటివి ప్రధానంగా చర్చిస్తారు. అనంతరం ట్రినిడాడ్ అండ్ టొబాగాలో 3,4 తేదీల్లో పర్యటిస్తారు. జూలై 4న అర్జెంటీనాకు వెళ్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో విస్తృత చర్చలు జరుపుతారు. 5వ తేదీన నుంచి 8వ తేదీ వరకూ బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియోలో జరిగే 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. 9న నమీబియా వెళ్లారు. ద్వైపాక్షిక చర్చలతో పాల్గొనడంతో పాటు పార్లమెంటులోనూ ప్రధాని ప్రసంగిస్తారు.

## రసాయన పరిశ్రమలో విస్ఫోటనం

(1వపేజీ తరువాయి)పోలీసులతోపాటు.. రిజర్వ్ బలగాలు, 11 ఫైరింజన్లు, అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా లోపల ఏంజరిగింది? కార్మికుల పరిస్థితి ఏమిటి? అనే వివరాలు బయటకు రాలేదు. నాలుగు మృతదేహాలను గుర్తించామని పోలీసులు పేర్కొన్నా.. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఈ ప్రమాదంలో 8 మంది చనిపోయినట్లు ధ్రువీకరించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో మృతుల సంఖ్య 12.. రాత్రి 9 గంటలకు.. 15కు చేరినట్లు ప్రకటించారు. అర్ధరాత్రికి మృతుల సంఖ్యను 19గా నిర్ధారించారు. పేలుడు ధాటికి మూడంతస్తుల గెస్ట్‌హౌస్ భవనం కూలిపోవడంతో.. అందులో ఉన్న జనరల్ మేనేజర్ ఎలాన్‌గోపన్ దుర్మరణంపాలయ్యారు. రాత్రి కడపటి వార్తలందేసరికి.. శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. వర్షం అడ్డంకిగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన సిగాచి పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎలాన్‌గోపన్ అనారోగ్యంతో బాధపడుతూ.. తన స్వరాష్ట్రమైన తమిళనాడులో నెలరోజులపాటు చికిత్స పొందారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
మంగళవారం
01 । జులై 2025

# అండమాన్ సముద్రంలో వరుస భూకంపాలు.. గంటల వ్యవధిలోనే మూడుసార్లు కంపించిన భూమి



**న్యూఢిల్లీ-నవభూమి:** అండమాన్ సముద్రం లో వరుస భూకంపాలుసంభవించాయి. ఇవాళ ఉదయం నుంచి ఏకంగా మూడు సార్లు భూ ప్రకంపనలు నమోదయ్యాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4 కంటే ఎక్కువగానే ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు పేర్కొంది.తొలుత సోమవారం ఉదయం 10:09 గంటల సమయంలో భూమి కంపించింది. భూకంపం తీవ్రత 4.7గా నమోదైంది. ఆ తర్వాత గంటన్నరకే అంటే ఉదయం 11:22కు మరోసారి భూమి కంపించింది. అప్పుడు భూకంపం తీవ్రత 4.6గా నమోదైంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12:06కి మరోసారి భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. 4.7తీవ్రతతో కంపించినట్లు ఎన్సీఎస్ వెల్లడించింది. వరుస ప్రకంపనలతో సముద్రంలో అల్లకల్లోలం నెలకొంది. కెరటాలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తీర ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. ఈ నెల 25న కూడా అండమాన్ సముద్రంలో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టరు స్కేలు పై భూకంపం తీవ్రత 4.2గా నమోదైంది.

## బొటాక్స్ చికిత్స వద్దన్న మల్లిఖా షెరావత్.. ఇన్‌స్టాలో వీడియో సందేశం




**ముంబై- నవభూమి:** గతవారం నటి షెఫాలీ జరివాలా మృతిచెందిన అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి మల్లికా షెరావత్ ఓ కీలక్ సూచన చేసింది. కృత్రిమ కాస్మోటిక్స్ వద్దు అని ఆమె పేర్కొన్నది. ఓ వీడియో సందేశాన్ని రిలీజ్ చేసింది. సహజమైన రీతిలో అందాన్ని పెంచుకోవాలన్నది. మర్డర్, ప్యార్ కే సైడ్ ఎఫెక్ట్స్, వెల్కమ్, విక్కీ విద్యా కా వో వాలా వీడియో చిత్రాల్లో షెరావత్ నటించించింది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన వీడియోలో బొటక్స్ చికిత్స వద్దని సూచన చేసింది. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని షెరావత్ తన అభిమానులకు వీడియోలో పేర్కొన్నది.

అందంగా కనిపించేందుకు తానేమీ ఫిల్టర్లు వాడడం లేదని, మేకప్ కూడా లేదని, తన హేయిర్స్‌ను బ్రష్ చేయడం లేదని, మీకోసం ఈ వీడియో షేర్ చేస్తున్నానని, బోటక్స్ వద్దు అని, కృత్రిమ కాస్మటిక్ ఫిల్టర్స్ వద్దు అని, ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఓకే చెప్పాలని, లవ్ యూ అని ఆమె తన ఇన్‌స్టా వీడియోలో పేర్కొన్నారు.గత వారం నటి షెఫాలీ జరివాలా మృతి వివాదాస్పదమైంది. ఆమెకు చావుకు అసలైన కారణం ఇంకా తెలియరాలేదు. జరిమాలాకు గుండెపోటు వచ్చినట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆమె అనూహ్య మరణంతో చర్చ మొదలైంది. కాస్మటిక్స్ ప్రొసిడ్యూర్స్ ను ఆమె తప్పుపట్టారు. యాంటీ ఏజింగ్ చికిత్స విధానాన్ని ఆమె వ్యతిరేకించారు. తన వీడియోకు క్యాప్షన్ ఇచ్చిందామె. స్వచ్ఛమైన ఆహారాన్ని తినడం, ద్రవాలను తీసుకోవడం, రెగ్యులర్ ఎక్సర్‌సైజతో పాటు కావాల్సినంత నిద్ర పోవాలని మల్లికా షెరావత్ పేర్కొన్నది.

## సిగాచి కెమికల్స్‌లో పేలుడు ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి..


### మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటన



**సంగారెడ్డి-నవభూమి:** సంగారెడ్డి జిల్లా ఇండస్ట్రియల్ పార్కులోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో పేలుడు ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి కింద ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలంలోని పాశ మైలారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు సంభవించింది. ఇండస్ట్రియల్ పార్కులోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఒక్కసారిగా రియాక్టర్ పేలిపోయింది. దీంతో ఎనిమిది మంది కార్మికులు మృతిచెందారు. ఘటనా స్థలంలో ఐదుగురు మరణించాగా, దవాఖానలో మరో ముగ్గురురు చనిపోయారు. మరో 15 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో చిక్కుకున్న 50 నుంచి 60 మంది కార్మ్మకులను బయటకు తీసుకువచ్చారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను ప్రైవేటు దవాఖానకు తరలించారు.

## దేశంలోని పలు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మూడు విమానాశ్ర యాలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఉత్తరప్రదేశ్ ఆగ్రా కర్ణాటకలోని హుబ్బళ్లి, మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్ ఎయిర్‌పోర్ట్స్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈమెయిల్స్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ బెదిరింపులపై ఆయా ఎయిర్‌పోర్ట్స్ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్ట్స్ ప్రాంగణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. అవి బూటకపు బెదిరింపులుగా అధికారులు తేల్చారు. ఈ మేరకు ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈమెయిల్ ఐడీ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## భారీ వర్షాలు.. కుప్పకూలిన ఐదంతస్తుల భవనం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా లో ఐదంతస్తుల భవంతి కుప్పకూలిపోయింది. అయితే, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో అందులోని నివాసితులను ముందుగానే ఖాళీ చేయించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాణ నష్టం తప్పింది. భవనం పేకమేడలా కుప్పకూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# నిరసనకారుల కాళ్లు విరగ్గొడితే రివార్డు ఇస్తానన్న పోలీస్ ఉన్నతాధికారి



**ఒడిశా-నవభూమి:** ఒడిశా లోని పూరీ జగన్నాథ రథయాత్రలో ఆదివారం గుండిచా ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు చనిపోగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ నివాసం ఎదుట నిరసన తెలిపేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రయత్నించాయి. ఈ సమయంలో చోటుచేసుకున్న ఓ సంఘటన తీవ్ర వివాదానికి దారి తీసింది. సీఎం ఇంటి వద్ద సెక్యూరిటీ అధికారిగా ఉన్న భువనేశ్వర్ ఏసీపీ నరసింఘ భోల్.. నిరసనకారుల కాళ్లు విరగ్గొడితే రివార్డు ఇస్తానని పోలీసులతో అనడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఏసీపీ నరసింఘ భోల్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. మరోవైపు.. ఈ తొక్కిసలాట ఘటనకు బాధ్యత వహిస్తూ పూరీ జిల్లా కలెక్టర్, ఎస్పీలను బదిలీ చేస్తూ ఒడిశా సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనపై 30 రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించనున్నారు.

సీఎం ఇంటి ముందు ఉన్న బారికేడ్ల వద్ద కాపలాగా ఉన్న పోలీసులకు భువనేశ్వర్ ఏసీపీ నరసింఘ భోల్ ఇచ్చిన ఆదేశాలకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. జగన్నాథ రథయాత్రకు అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని.. కాంగ్రెస్ శ్రేణులు సీఎం నివాసం ఎదుట నిరసన తెలిపాయి. ఈ నేపథ్యంలో సీఎం ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. "ఎవరైనా ఇక్కడికి వస్తే కాళ్లు విరగ్గొట్టండి. అలా చేసిన వారికి రివార్డు ఇస్తాను" అని ఏసీపీ నరసింఘ భోల్ సిబ్బందికి చెప్పారు. "పోలీసులు ఎవరినీ పట్టుకోవాల్సిన అవసరం లేదు, దూరంలో ఉండి కాళు విరిగిన వారిని తానే పట్టుకుంటాను" అని ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.అయితే తాను మాట్లాడిన వీడియో నెట్టింట వైరల్ కావడంపై ఏసీపీ నరసింఘ భోల్.. మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ జరిగే నిరసనను, తమ విధులను పట్టించుకోకుండా ప్రతి విషయాన్ని మీడియా వైరల్ చేస్తే తాము ఎలా పనిచేయాలంటూ ప్రశ్నించారు. సీఎం ఇంటి ముందు ఆందోళన చేస్తే.. నిరసనకారులను అడ్డుకోవడం తమ డ్యూటీ అని తెలిపారు. కొందరు నిరసనకారులు బారికేడ్లను దాటి సీఎం ఇంటి వైపు వెళ్తుండటంతో వారిని అడ్డుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు ఒక్కోసారి లాఠీఛార్జ్ చేయాల్సి వస్తుందని.. అవన్నీ తమ విధుల్లో భాగమని తేల్చి చెప్పారు.మరోవైపు.. పూరీ జగన్నాథ రథయాత్రలో జరిగిన తొక్కిసలాటపై ఒడిశా ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్, పూరీ ఎస్పీ వినిత్ అగర్వాల్‌లను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ ఘటనపై 30 రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను ముఖ్యమంత్రికి సమర్పిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి తెలిపారు. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడం వల్లే తొక్కిసలాట

# లివ్‌ఇన్ పార్ట్‌నర్ దారుణ హత్య




**బెంగళూరు-నవభూమి:** సహజీవనం చేసిన ప్రియురాలిని దారుణంగా హతమార్చాడు ఓ వ్యక్తి. అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి చెత్త లారీలో పడేశాడు. చెత్త లారీలో ఆదివారం ఉదయం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడినిగుర్తించి అరెస్టు చేశారు. ఈ దారుణ ఘటన బెంగళూరులో కలకలం సృష్టించింది.వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం బెంగళూరులోని బీబీఎంపీ (బృహత్ బెంగళూరు మహానగర పాలికే) సిబ్బంది చెత్తను తరలిస్తుండగా.. ఓ చెత్త లారీలో అనుమానాస్పదంగా ఉన్న ఒక గోనె సంచిని గుర్తించారు. దాన్ని తెరిచి చూడగా, అందులో ఒక మహిళ మృతదేహం కనిపించింది. ఆమె చేతులు కట్టేసి ఉన్నాయి. ఈ భయంకర దృశ్యం చూసి షాక్‌కు గురైన సిబ్బంది.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి బైక్‌పై ఒక సంచిని తీసుకువచ్చి చెత్త లారీలో పడేస్తున్న దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. ఆ ఆధారాలతో పోలీసులు నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. నిందితుడిని అస్సాంకు చెందిన 33 ఏళ్ల మహమ్మద్ షంషుద్దీన్, మృతురాలిని ఆశాగా పోలీసులు గుర్తించారు.

**అసలు ఏం జరిగింది?**

నిందితుడు షంషుద్దీన్, మృతురాలు ఆశా (దాదాపు 40 ఏళ్లు) గత సంవత్సరంన్నరగా సహజీవనం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరు దక్షిణ బెంగళూరులోని హులిమావులో అద్దె ఇంట్లో కలిసి ఉంటున్నారు. వీరిద్దరికీ ఇదివరకే విడి విడిగా పెళ్లిళ్లు అయి.. ఇద్దరు చొప్పున పిల్లలు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. అయితే సమాజానికి మాత్రం తాము భార్యాభర్తలమని చెప్పుకున్నారని వెల్లడించారు. ఆశా అర్బన్ కంపెనీలో హౌస్ కీపింగ్ సర్వీసులు చేసేదని.. షంషుద్దీన్ భార్యాపిల్లలు అస్సాంలో నివసిస్తున్నారని పోలీసులు తెలిపారు.

**హత్యకు కారణం అదే..**

సౌత్ బెంగళూరు డీసీపీ లోకేష్ బి జగలసర్ వివరాలు వెల్లడించారు. నిందితుడు, బాధితురాలి మధ్య తరచుగా గొడవలు జరిగేవని.. ఒకరోజు గొడవ తీవ్రం కావడంతో షంషుద్దీన్ ఆశాను గొంతు నులిమి చంపేశాడని తెలిపారు. "హత్య చేసిన తర్వాత షంషుద్దీన్ మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కు. బైక్‌పై తీసుకెళ్లి చెత్త లారీలో పడేశాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే, సీసీటీవీ ఫుటేజీలే కీలక ఆధారాలుగా నిందితుడి ఆచూకీ లభించింది. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపించాము. పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు." డీసీపీ జగలసర్ వెల్లడించారు.

### మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం..

# త్రిభాషా విధానంపై యూటర్న్



**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ విద్యా విధానంపై అమలు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దీనిపై తీవ్ర వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. త్రిభాషా విధానంపై అధ్యయనం చేసేందుకు నరేంద్ర జాదవ్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. మహాయుతి సర్కారు త్రిభాషా విధానం అమలుకు ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది.త్రిభాషా విధానానికి సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. ఈ విధానాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై ప్రముఖ విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో సీఎం దేవేందర్ ఫడ్నవీస్ ఈ విషయాన్ని తెలిపారు. 'ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్‌లలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై అధ్యయనం డాక్టర్.నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం' అని ఆయన ప్రకటించారు.గతంలో ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రఘునాథ్ మషేల్కర్ కమిటీ సిఫార్సులను అంగీకరించారని ఫడ్నవీస్ గుర్తు చేశారు. నూతన జాతీయ విద్యా విధానం (%చీజు%)లో భాగంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే, త్రిభాషా విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని కేంద్రంతో డీఎంకే సర్కారు యుద్ధం ప్రకటించిన సంగతి తెలిసిందే.అయితే, మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న త్రిభాషా విధానంపై ఒక ఉత్తర్వు జారీ చేసింది. దీని ప్రకారం ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో 1-5 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేసింది. దీనిపై వ్యతిరేకత రావడంతో హిందీని ఆప్షనల్‌గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా విమర్శలు ఆగలేదు. ఈ విషయంపై పోరాడేందుకు ఠాక్రే సోదరులు మళ్లీ కలవడానికి సిద్ధమయ్యారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ జరిగింది. ఈ పరిణామాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వచ్చే నెల 5న శివసేన యూబీటీ, ఎంఎన్ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న నిరసనను రద్దు చేస్తున్నట్లు సంజయ్ రౌత్ ప్రకటించారు. ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవడంతో ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు కలిసి చేసే నిరసన కార్యక్రమం కూడా రద్దయింది. మొత్తానికి మహారాష్ట్ర ప్రభుత్వం హిందీ విషయంలో మెట్టు దిగింది.

# భారతీయులకు శుభవార్త..

### వారికి శాశ్వత నివాసంపై కెనడా కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ-నవభూమి:** విదేశాల నుంచి ప్రతిభావంతులు, ఆర్థిక వలసదారుల శాశ్వత నివాసానికి సంబంధించి కొత్త విధానాన్ని కెనడా త్వరలోనే అమలు చేయనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎకనామిక్ మొబిలిటీ పాత్‌వేస్ పైలట్ లో ఈ మేరకు మార్పులు చేపడుతోంది. ఈ కొత్త విధానం ద్వారా నైపుణ్యం కలిగిన శరణార్థులు, విదేశీ వ్యక్తులు కెనడాలో శాశ్వత నివాసం , ఉద్యోగ అవకాశాలు పొందనున్నారు. డిసెంబర్ 31తో ముగియబోతున్న ఈఎంపీపీకి ముందు దీనిని ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఈఎంపీపీ విధానాన్ని 2018లో కెనడా ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ఈ ఏడాది మార్చి వరకూ సుమారు 970 మంది శరణార్థులు కెనడాలో శాశ్వత నివాసం పొందారు. ఇది శరణార్థులకు కేవలం ఆశ్రయం కల్పించడమే కాకుండా ఆర్థికంగా దేశానికి తోడ్పాటు అందించేవారిగా వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు.ఇమ్మిగ్రేషన్. రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) విధానంలో భాగంగా విదేశీ కార్మికులు, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల్లో పని చేసే వారికి, విద్యార్థులకోసం ఉద్దేశించిన పీజీ వర్క్ పర్మిట్ భాగస్వామి ఓపెన్ వర్క్ పర్మిట్ విధానంలోనూ మార్పులు చేయనున్నారు. విదేశీ కార్మికులు, అంతర్జాతీయ విద్యార్థుల జీవిత భాగస్వాములకు కూడా ఇది వర్తిస్తుంది. హెల్త్‌కేర్, ట్రేడ్ వర్కర్లు, ఎడ్యుకేషన్ వర్కర్లు, ఫ్రెంచ్ మాట్లాడే వ్యక్తులు (వీరికి ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ ద్వారా ప్రత్యేక ప్రాధాన్యం), ఇప్పటికే కెనడాలో తాత్కాలిక నివాసితులుగా ఉన్నవారిలో కనీసం 40% మందికి శాశ్వత నివాసం కల్పించనున్నారు. దేశం వెలుపల ఉన్న కుటుంబ సభ్యుల శాశ్వత నివాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయనున్నట్టు తెలిపింది. కాగా, భారతీయులకు కెనడా, అమెరికా, యూకేలపై క్రమంగా మోజు తగ్గిపోవడం గనమార్హం.కాగా, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మొత్తం 834,010 తాత్కాలిక వీసా దరఖాస్తులను కెనడా ఆమోదించగా.. ఇందులో భారతీయులే అధికం (3,82,055 (45.8%). నూతన శాశ్వత నివాస విధానం, వీసా నిబంధనల్లో మార్పుల వల్ల భారతీయ విద్యార్థులు, ఉద్యోగులకు మేలు జరగనుంది. ఈ మార్పులు అనేక కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేయనున్నాయి. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ ప్రాధాన్య జాబితాలో హెల్త్‌కేర్, టెక్ వర్కర్లకు అవకాశాలు పెరుగుతాయి. తాత్కాలిక వీసా ఆమోదంలో భారతీయులు మొదటి స్థానంలో ఉండటం, వారి వలసదారుల్లో వారి ప్రాధాన్యాన్ని సూచిస్తుంది. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కెనడా పర్యటనతో ఇరు దేశాల మధ్య దాదాపు రెండేళ్లుగా కొనసాగుతోన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలకు, వివాదాలకు తెరపడిన సంగతి తెలిసిందే. ఖలీస్థాన్ ఉగ్రవాది హర్దీప్ నిజ్జార్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల పాత్ర ఉందటూ కెనడా మాజీ ప్రధాని జస్టిస్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించారు.

## అది పార్టీ హైకమాండ్ చేతిలో ఉంది.. కర్ణాటకలో సీఎం మార్పుపై ఖర్గే




**న్యూఢిల్లీ-నవభూమి:** కర్ణాటక లో ముఖ్యమంత్రి మార్పు జరగనుందని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు సీఎం పగ్గాలు కట్టబెట్టబోతున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. కర్ణాటక రాజధాని బెంగళూరు లో మీడియా ఈ అంశంపై ప్రశ్నించడంతో ఆయన సమాధానం చెప్పారు.ముఖ్యమంత్రి మార్పు అంశం పార్టీ హైకమాండ్ చేతిలో ఉందని, పార్టీ హైకమాండ్‌లో ఏం జరుగుతుందనే విషయాన్ని ఏ ఒక్కరూ బయటికి చెప్పరని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ విషయంలో చర్య తీసుకునే హక్కు హైకమాండ్‌కు మాత్రమే ఉందని, కాబట్టి విషయాన్ని హైకమాండ్‌కే వదిలేద్దామని చెప్పారు. దీనిపై ఎవరూ అనవసరమైన సమస్యలు సృష్టించవద్దని ఆయన కోరారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వార్తలు నిజమేనా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఖర్గే పైవిధంగా స్పందించారు.డీకే శివకుమార్ కర్ణాటక సీఎం కాబోతున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం అదే విషయం చెప్పడం చర్చనీయాంశంగా మారింది. మరో రెండుమూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని హుస్సేన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం హైకమాండ్ శివకుమార్ గురించే యోచిస్తోందని అన్నారు. డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది.

## మా ప్రభుత్వం ఐదేళ్లు రాయిలా పటిష్టంగా ఉంటుంది : సిద్ధరామయ్య

**బెంగుళూరు-నవభూమి:** కర్ణాటక ప్రభుత్వం లో అధికార కేంద్రం మారబోతోందని, సీఎం సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవిని వీడుతారని, ఆయన స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం కాబోతున్నారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారానికి సిద్ధరామయ్య ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తమ ప్రభుత్వం ఐదేళ్లు రాయిలా పటిష్టంగా ఉంటుందని ప్రకటించారు.తనకు, డీకే శివకుమార్‌కు మధ్య చీలికలు తెచ్చేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయని, కానీ వారి ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. సోమవారం మైసూరులో డీకే శివకుమార్‌తో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని నిరూపించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ చేయిచేయి కలిపి పైకి లేపి చూపించారు.

## ఐదేళ్లు పక్కా... సీఎం, డిప్యూటీ సీఎం ఐక్యతారాగం

**బెంగుళూరు-నవభూమి:** కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా రాష్ట్రానికి రావడంపై సిద్ధరామయ్య మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై సూర్జేవాలా దృష్టి సారించనున్నట్టు చెప్పారు. పార్టీని పటిష్టం చేయడం కోసం వచ్చారని, ఆయన పని ఆయన చేస్తారని తెలిపారు.బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో విభేదాలున్నాయనే ఊహాగానాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కొట్టివేశారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. చేతులు కలిపి ఐక్యతను చాటుకున్నారు. సోమవారంనాడు మీడియా సమావేశంలో ఇద్దరు నేతలూ కలిసి పాల్గొన్నారు.'మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు దృఢంగా ఉంటుంది. మేము కలిసికట్టుగా ఉన్నాం, కలిసే పనిచేస్తాం' అని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక కాంగ్రెస్‌లో గొడవలు ఉన్నాయనే ఊహాగానాలను ఆయన కొట్టివేశారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా రాష్ట్రానికి రావడంపై మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై సూర్జేవాలా దృష్టి సారించనున్నట్టు చెప్పారు. పార్టీని పటిష్టం చేయడం కోసం వచ్చారని, ఆయన పని ఆయన చేస్తారని తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను సిద్ధరామయ్య ప్రారంభించడం లేదంటూ విపక్ష నేత ఆర్.అశోక చేసిన వ్యాఖ్యలపై సిద్ధరామయ్య మండిపడ్డారు. 'బీజేపీ ఒక అబద్ధాల పుట్ట. వాళ్ల పని అదే. డీకే శివకుమార్, నేనూ కలిసే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఐదేళ్లు స్థిరంగా పనిచేస్తుంది. బీజేపీ కామెంట్లను మేము పట్టించుకునేది లేదు' అని అన్నారు.ఖర్గే ఏమి చెప్పారు?ముఖ్యమంత్రి పదవి అనేది అధిష్ఠానం నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారంనాడు మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. దీనిపై ఎవరూ మాట్లాడేది ఉండదని, తదుపరి చర్య తీసుకునే హక్కు అధిష్ఠానానికే విడిచిపెట్టాలని అన్నారు. ఏ ఒక్కరూ అనవసరమైన సమస్యలు సృష్టంచరాదని స్పష్టం చేశారు.



## మద్యం తాగితే స్తంభానికి కట్టేయడమే...

చెన్నై-నవభూమి:నాగపట్టినం జిల్లాలో జాలర్లు అధికంగా నివసించే ఓ కుగ్రామంలో మద్యం తాగి వచ్చే వారిని రోజంతా ఆలయ స్తంభానికి కట్టివేయడం, మహిళలను ఎగతాళి చేసే వారికి గుండు కొట్టించడం వంటి తీర్మానాలను గ్రామసభలో ఆమోదించి, అమ లు చేస్తున్నారు. గ్రామసభలో చేసిన తీర్మానాలను అందరికీ తెలిసేలా బ్యానర్లు కూడా కట్టారు. నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపం పంచనాతికులం నడుచేది పంచాయతీ పరిధిలోని సిరుతలైకాడులో సుమారు 2,000 మంది నివసిస్తున్నారు. వీరికి చేపల వృత్తి ప్రధానమైనది. కొంతకాలంగా గ్రామానికి చెందిన యువకులు మద్యానికి బానిసలు మారడం ఆందోళనకు గురిచేసింది. ఆ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు. గ్రామ పెద్ద నామకోటి నేతృత్వంలో శనివారం గ్రామస్తులు సమావేశమయ్యారు. మద్యం తాగి గ్రామంలో ప్రవేశించి ఘర్షణలకు పాల్పడే వారిని మారియమ్మన్ ఆలయ స్తంభానికి రోజంతా కట్టిపడేయాలని, వారి వాహనాలు స్వాధీనం చేసుకోవాలని మొదటి తీర్మానం చేశారు. ఇక మహిళలను ఎగతాళి చేయడం, ప్రేమ పేరుతో యువతుల వెంటపడడం తదితర ఘటనలకు పాల్పడే వారిని గుర్తించి ఆలయం ముందు గుండు గీయించాలని రెండో తీర్మానం చేశారు. ఈ తీర్మానాలు అందరూ తెలుసుకునేలా గ్రామంలోని పలు ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటుచేశారు.



## పశ్చిమాసియాలో ట్రంప్ తుపాను

పశ్చిమాసియా ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా రాజకీయ అస్థిరత, సైనిక సంఘర్షణల మధ్య సంక్లిష్ట పరిణామాల బాటలో సాగుతోంది. ఆయిల్, అణుశక్తి, మతం, భౌగోళిక వ్యూహాలు ఇవన్నీ ఈ ప్రాంతాన్ని ప్రపంచ శాంతికి సవాలుగా నిలిపాయి. 2025లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు, ముఖ్యంగా ఇజ్రాయిల్, ఇరాన్‌ల మధ్య మళ్లీ తెగిన అగ్నిరేఖ, ట్రంప్ రాజకీయం అంతర్జాతీయ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో శాంతికి భవిష్యత్తు ఉందా? లేదా మరింత రక్తపాతమే కచ్చితమా అన్న సందేహాలు తెరపైకి వచ్చాయి.

ఈ ఉత్కంఠభరిత ఘటనల శృంఖల క్రమంలో ప్రారంభం ఇజ్రాయిల్ చేపట్టిన ఉగ్ర దాడుల వల్లే జరిగింది. ప్రత్యేకించి నటాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డో వంటి అణుశుద్ధి కేంద్రాలపై జరిగిన ఆపరేషన్లు చుట్టూ అనేక అనుమానాలు, వ్యూహాలు రేగాయి. ఫోర్డో సెంటర్ 80 మీటర్ల లోతులో భూగర్భంలో ఉండడం వల్ల సాధారణ బాంబులతో దాన్ని ఛేదించడం అసాధ్యం. అయినప్పటికీ ఇజ్రాయిల్ దాని వైపు ప్రయోగించిన దాడుల వల్ల జరిగిన నష్టంపై స్పష్టత లేకపోవడం, ఐఎఇఎ నివేదికలతో కూడిన అనిశ్చితిని తీసుకువచ్చింది.

ఇజ్రాయిల్ దాడులు ఒక్కటే కాకుండా, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగడం వల్ల ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టంగా మారింది. ఆయన ప్రకటించిన ప్రకారం అమెరికా గణనీయ స్థాయిలో భూగర్భ విధ్వంసక ఆయుధాలను ఉపయోగించిందని చెబుతూ నాటకీయ ప్రకటనలు చేశాడు. కానీ అదే సమయంలో ఐఎఇఎ వంటి సంస్థలు ఇప్పటికీ ఎలాంటి ధ్రువీకరణలు ఇవ్వకపోవడం, రేడియేషన్ వంటి ధార్మిక ప్రభావాలు కనబడకపోవడం, ఈ ప్రకటనల నేటివిటీపై అనేక సందేహాలు రేకెత్తించాయి.

ఇరాన్ ఎన్‌పిటి ఒప్పందాన్ని ఉల్లంఘించిందనే ఆరోపణలు గత పన్నెండేళ్లుగా ఇజ్రాయిల్ వల్లెవేస్తున్నదే. ఐఎఇఎ తనిఖీలు జరుపుతున్నా ఇప్పటివరకు అటువంటి ఉల్లంఘనలకు ఆధారాలు లభించలేదు. దీనివల్ల నిజమైన ఉద్దేశంపశ్చిమాసియాలో అమెరికా-ఇజ్రాయిల్ ద్వయాధిపత్యానికి ఎటువంటి ఆటంకమూ ఉండకూడదన్న ఆలోచన స్పష్టమవుతోంది.

ఇజ్రాయిల్‌కు మాత్రమే అణ్వాయుధ అధికారం ఉండాలి అన్న సంకల్పమే ఈ ప్రచార యుద్ధానికి మౌలిక ప్రేరణ. ఇజ్రాయిల్ అణ్వస్త్ర కార్యక్రమం ఐఎఇఎ పర్యవేక్షణకు వెలుపల సాగుతున్నది. మరోవైపు ఇరాన్ నిర్విరామంగా ఐఎఇఎ పర్యవేక్షణను అంగీకరిస్తూ వస్తున్నప్పటికీ దానిపైనే నిందలు వేయడం ప్రపంచ రాజకీయాల్లోని ద్వంద్వ ప్రమాణాలను బయటపెడుతుంది.

ఇరాన్ ఇచ్చిన వ్యూహాత్మక ప్రతిదాడులు ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించడంలో విజయవంతమయ్యాయి. హయిఫా, టెల్‌అవీవ్ వంటి నగరాల్లో ఉన్న కేంద్రాలపై ఇరాన్ క్షిపణులు నిష్ఠూరంగా పడటంతో, ఈ మేరకు రక్షణ ఖాళీలను ప్రపంచం ముందుకు తెచ్చింది. ఇటువంటి దాడుల తర్వాత ఇజ్రాయిల్ తట్టుకోలేక మరోసారి అమెరికా మద్దతు కోరడం, ట్రంప్‌ను రంగంలోకి దించడమే అత్యవసరంగా మారింది.

ఇజ్రాయిల్ పాలస్తీనా పైన చేస్తున్న చర్యలు మరీ దారుణంగా మారుతున్నాయి. వేల మంది మహిళలు, పిల్లలు బలవ్వడం, ఆహార సరఫరాలు కట్ చేయడం వల్ల గాజా అసాధారణమైన మానవతా సంక్షోభానికి గురవుతోంది. ఐక్యరాజ్యసమితి ప్రకటనలను, అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా తుంచివేసినట్టుగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తోంది.

ఇలాంటి ఘోర పరిస్థితులపై జి7 దేశాలు స్పందించిన తీరు దిగ్భ్రాంతి కలిగించేలా వుంది. వీరు ఇజ్రాయిల్ "ఆత్మరక్షణ హక్కు" పేరుతో దాని చర్యలకు మద్దతు తెలిపిన ప్రకటనలు చేస్తున్నా అది అసలు సమస్యను పక్కన పెట్టే ధోరణిగా మారింది. ఈ ప్రచార భ్రమలో మానవతా విలువలు చిదిమిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో భారత్ మౌనం కలకలం రేపుతోంది. చారిత్రకంగా అలీనోద్యమ నాయకత్వాన్ని వహించిన భారత్, ఇలాంటి సందర్భాల్లో శాంతికి మద్దతుగా గళమెత్తే పాత్ర పోషించేది. కానీ ప్రస్తుతం భారత ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిశ్చల వైఖరి, మిత్రదేశాలకు దాసోహమనిపించే స్థితిని ప్రతిబింబిస్తోంది. ఒక్కసారి కూడా గాజా మారణహోమాన్ని ఖండించకపోవడం, ఐరాసలో వాణిని వినిపించకపోవడం విచారకరం.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యవాదుల పాత్ర కీలకం. శాంతికి మద్దతుగా నిలవాలి. జాత్యహంకారాలను నిరసించాలి. యుద్ధోన్మాదులకు వ్యతిరేకంగా ఐక్యత అవసరం. భారత రాజ్యాంగం నిలబెట్టే విలువలు - లౌకికత, సమానత్వం, శాంతి - ఇవే మన ప్రజాస్వామ్యపు నిజమైన శక్తులు. ఈ విలువల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా శాంతిని పునరుద్ధరించే ఉద్యమాల్లో భారతీయులు భాగస్వామ్యం కావాలి.

# తెలుగు తల్లి గర్వకారణం - పీవీ జీవితం



భారతదేశ చరిత్రలో కొన్ని గొప్ప నాయకుల జీవితాలు మానవ సహజ విలువలకు ప్రతీకగా నిలుస్తాయి. వారి ఆలోచనలు, ఆచరణలు, అభిప్రాయాలు దేశాన్ని ఏ దిశగా నడిపించాలో నిర్ణయించే శక్తి కలిగివుంటాయి. అలాంటి వారిలో పాములపర్తి వెంకట నరసింహారావు గారు అత్యున్నత స్థానం పొందారు. తెలుగు తల్లికి గర్వకారణంగా నిలిచిన ఆయన, భారతదేశ రాజకీయ, ఆర్థిక, బౌద్ధిక రంగాల్లో ఒక శిఖర సదృశంగా నిలిచారు. ఒకవైపు ఆర్థిక సంస్కరణల పితామహుడిగా, మరోవైపు సంపూర్ణ ప్రజాస్వామ్యానికీ, జాతీయ స్వాభిమానానికీ నిలువెత్తు చిహ్నంగా నిలిచిన ఘనత ఆయనదే. 70 సంవత్సరాల వయస్సులో పదవికి వచ్చిన ఆయన, తన అనుభవాన్ని, మేధస్సును, ప్రజానురాగాన్ని సమన్వయపరిచి దేశానికి అవసరమైన మార్గదర్శకుడిగా ఎదిగారు.

పీవీ జీవిత కథ నిబిడీభూతమైన మార్పులతో, సవాళ్లతో, విజ్ఞానంతో నిండి ఉంది. విద్యార్థి దశ నుంచే ఆయనకు భాషలపై, చరిత్రపై, రాజకీయాలపై అపారమైన ఆసక్తి. 17 భాషల్లో పట్టు కలిగిన మేధావిగా, స్వతంత్రంగా ఆలోచించే తత్త్వవేత్తగా ఆయన ఎదుగుదల అనేది యాదృచ్ఛికం కాదు. నిజాం పాలనలో పెరిగిన ఆయన, తెలంగాణ ప్రాంతంలో స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాడారు. స్వామి రామానందతీర్థ శిష్యుడిగా నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని, యువకుడిగా దేశభక్తిని తన గుండెల్లో గుదిబండలా మోసుకెళ్లారు.

ఆయన రాజకీయ ప్రవేశం కాంగ్రెస్ పార్టీలో ప్రారంభమైంది. తన ప్రతిభతో తక్కువ కాలంలోనే కీలక నాయకుడిగా ఎదిగారు. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, ప్రగతిశీల శాసనాలు, భూసంస్కరణలు అమలులోకి తీసుకొచ్చారు. రైతులకు భూమిపై హక్కులు కల్పించే చారిత్రాత్మక చట్టాలు ఆయన హయాంలో అమలయ్యాయి. రాజకీయంగా వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ, సామాజిక న్యాయం కోసం రాజీనామాకు కూడా వెనకాడలేదు. యువతను ప్రోత్సహించడంలో, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

పీవీ, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ఐక్యరాజ్యసమితిలో చేసిన ఉపన్యాసం ప్రపంచాన్ని ఆకర్షించగా, 1983లో క్యూబాలో స్పానిష్ భాషలో ప్రసంగించి ఫిడెల్ కాస్ట్రో వంటి నేతల ప్రశంసలను పొందారు. ఈద్వారా ఆయన ప్రపంచ రాజకీయ రంగంలో భారత ప్రతిష్ఠను పెంచారు. దేశీయంగా హోం శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ వంటి కీలక పదవులు నిర్వహించి, కొత్త విద్యా విధానాన్ని రూపొందించారు. విద్యా రంగాన్ని నూతన దిశలో నడిపించే పునాది ఆయన వేసినదే.

1991 లో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్నపుడు, అనూహ్యంగా ప్రధాని పదవికి అధిష్ఠించిన పీవీ, కేవలం సంక్షోభ నివారణకే కాదు, దేశ భవిష్యత్తు మార్గదర్శనంగా నిలిచే విధంగా ఆర్థిక సంస్కరణలు ప్రారంభించారు. విదేశీ పెట్టుబడులకు తలుపులు తీసి, లైసెన్స్ రాజ్‌కి గుడ్‌బై చెప్పి, సుదీర్ఘకాలంగా స్థిరంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ మార్గాల్లో నడిపించారు. ఈ సంస్కరణల వల్ల భారతదేశం ప్రపంచ ఆర్థిక రంగంలో నిలబడగలిగింది. మంత్రిగా, నేతగా కాకుండా, దేశదృష్టిని మారుస్తూ చేసిన ఈ సంస్కరణలు ఆయన్ను నూతన భారత రూపశిల్పిగా నిలిపాయి.

ఆయనకు అప్పట్లో రాజకీయంగా పూర్తి మద్దతు లేకపోయినా, తీవ్ర వ్యతిరేకతల మధ్య ఆయన తీసుకున్న నిర్ణయాలు ఆయన ధైర్యానికి, దూరదృష్టికి సాక్ష్యాలు. అప్పటి ప్రత్యక్ష ప్రత్యర్థులైన లాలకృష్ణ అద్వానీ, అటల్ బిహారీ వాజపేయి వంటి నాయకులు కూడా పీవీ నేతృత్వాన్ని గౌరవించారు. ఆయన పనితీరులో నిర్ణయాత్మకత, స్ఫుటత, మౌనంలో ఉన్న మేధస్సు కనిపిస్తుంది. మాటల కంటే చేతలతో పనిచేసిన నేత పీవీ. నెహ్రూ-గాంధీ కుటుంబానికి అతీతంగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి వ్యక్తిగా, దక్షిణాదివ్యక్తిగా, తెలుగువాడిగా ఆయన ఎదుగుదల స్వతంత్ర భారత చరిత్రలో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఆయన సాహిత్యాభిమానం కూడా విశేషం. జ్ఞానపీఠ్ విజేత విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' కృతిని హిందీలోకి స్వయంగా అనువదించారు. సాంస్కృతికంగా ఆయనకు కలిగిన అభిరుచి వల్లే వివిధ భాషల రచయితలతో వ్యక్తిగత సంబంధాలు కొనసాగించారు. రచయితగా కూడా ఆయన గొప్ప ప్రస్థానం కలిగి ఉన్నారు. "గొల్ల రామవ్వ" కథ వంటి రచనలు తెలంగాణ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించడంతోపాటు, సామాజిక న్యాయాన్ని కూడా చాటిచెబుతాయి.

పీవీ గారు సంస్కరణలకు మారుపేరు. ఏ శాఖలో ఉన్నా, ఏ స్థానంలో ఉన్నా మార్పుకు దిశానిర్దేశం చేయడమే ఆయన లక్ష్యం. హోం శాఖ మంత్రిగా ఉండగా, దేశంలో ఉగ్రవాదాన్ని అణచిన ఘనత ఆయన్నే వెంబడించింది. పంజాబ్ లో ఖలిస్తాన్ ఉద్యమాన్ని అదుపు చేయడంలో ఆయన శక్తివంచన లేకుండా పనిచేశారు. కశ్మీర్ లో ప్రముఖుల అపహరణ వ్యవహారంలో తీవ్రవాదులకు తలవంచకుండా పనిచేసిన నేత ఆయన. ఈ అన్ని విషయాలు ఆయన ధైర్యాన్ని, దృష్టిని, కార్యాచరణలో నిబద్ధతను చూపుతాయి.

ఆయన మౌనం చాలా సందర్భాల్లో పలుకుబడి కంటే బలంగా పనిచేసింది. ప్రజల కష్టాలు ఆయన మనసుకు హత్తుకునేవి. దేశ రాజకీయాలలో పీవీ ఒక శాంత స్వభావ మేధావిగా గుర్తింపు పొందినప్పటికీ, అనుకున్న పనిని పూర్తి చేయడానికి అవసరమైతే కఠిన నిర్ణయాలూ తీసుకునే నాయకుడిగా మిగిలారు. ఆయనను రాజకీయ ప్రత్యర్థులు "అపర చాణక్యుడు" అన్నట్లు ఆయన బుద్ధి, దూకుడు, వ్యూహాత్మకత దక్షిణాసియాలో అరుదైన మేళవింపు.

ఆయనపై ఎంతో దురదృష్టంగా రాజకీయంగా అంగీకారం లేకపోవడం, మరణానంతర నిర్లక్ష్యం కూడా జరిగినది. కానీ సమయం గడిచినకొద్దీ ఆయన సేవలు వెలుగులోకి వస్తున్నాయి. భారతరత్న అవార్డు ప్రకటించబడటంతోపాటు, పీవీ వారసత్వాన్ని సమాజం మరింతగా గుర్తించేందుకు ప్రేరణ కలుగుతోంది. ఆయన ఎప్పటికీ ఒక మార్గదర్శకుడు. మార్పును సృష్టించిన నేత. దేశమంతా గుర్తుంచుకోవలసిన మేధోశక్తి.

జాతి నిర్మాణంలో పీవీ నరసింహారావు పాత్ర అనితరసాధ్యమైనది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం నుంచి, భూసంస్కరణలు తీసుకురావడం, భారతదేశాన్ని గ్లోబల్ ఆర్థిక వేదికపై నిలబెట్టడం వరకూ ఆయన చేసిన సేవలు అపారమైనవి.

-

### కరేడు భూముల రక్షణ

# రైతుల హక్కు



కరేడు భూముల రక్షణ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులు , నాయకుల పై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నాము . వారి భూముల రక్షణ కోసమై ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయటమనేది రైతాంగం ప్రాథమిక ప్రజాస్వామ్య జీవించే హక్కు. తర తరాలపాటు ఆ భూములపై జీవిస్తున్న రైతులు భూములు ఇవ్వాలా ?లేదా ?అనేది వారి హక్కు. రైతుల యొక్క భూములను కారు చౌకగా , బలవంతముగా బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పటం అధికారంలో ఉన్న పాలకవర్గ పార్టీలకు నిత్యకృత్యమైంది. రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల దేవాదాయ, ధర్మదాయ భూములు, 1973 వ్యవసాయ భూపరిమితి సీలింగ్ చట్టం ప్రకారం తేలిన మిగులు భూములు పేదలకు నేటికీ పంచలేదు.

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు గ్రామానికి చెందిన
వెయ్యి ఎకరాల ఉలవపాడు మామిడి తోటలతో సహా, తరతరాలుగా వచ్చిన 8348 ఎకరాల పంట పొలాలను "ఇండోసోలార్ పీవీ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ" సంస్థకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కేటాయించడాన్ని రద్దు చేయవలసిందిగా కోరుతున్నాం . కందుకూరు నుండి గెలిచిన శాసనసభ్యుడు ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవాలి. అలాకాకుండా రైతాంగానికి వ్యతిరేకంగా స్థానిక శాసనసభ్యులు నడుచుకోవటం అన్యాయమైనది.



భూ సేకరణకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయడాన్ని సిపిఐ (ఎమ్.ఎల్) రెడ్ స్టార్ స్టార్ ఖండిస్తున్నది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కరేడు గ్రామ రైతులపై అమానుషంగా పోలీసులు జులుం ను ప్రదర్శించడాన్ని ఖండిస్తున్నాము. పంటలు పండే వ్యవసాయ భూములను సేకరించటాన్ని రైతాంగము ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వెంటనే ఆపాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాం. రైతులు,రైతు సంఘాలు, ప్రజలు, ప్రజానాయకులు, ప్రజాస్వామిక వాదులు, భూసేకరణ ప్రక్రియ ను ఆపమని ప్రభుత్వాన్ని కోరుతున్నారని విజ్ఞప్తి చేస్తున్నాం. శాంతియుతంగా రాస్తారోకో చేస్తున్న రైతులు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం. అరెస్టు చేసిన వారినందరినీ విడుదల చేయాలని కోరుతున్నాం.

**మన్నవ హరిప్రసాద్,**
**పొలిట్‌బ్యూరో సభ్యుడు సిపిఐ ఎంఎల్**

### భారతదేశం ఎదుర్కొంటున్న

# అంతర్జాతీయ దౌత్య సవాళ్లు

షాంఘై సహకార సంస్థ 2025 సదస్సులో ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు పట్ల దృష్టి పెట్టినప్పటికీ, పహల్గాం ఉగ్రదాడి విషయాన్ని గమనించకపోవడాన్ని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ "ద్వంద్వప్రమాణాలకు నిదర్శనంగా" పేర్కొన్నారు. భారత్ పాకిస్థాన్‌పై తీవ్రమైన విమర్శలు చేసిన తర్వాత, ఉమ్మడి ప్రకటన విడుదల కాకపోవడం, పహల్గామా ఉగ్రదాడి నిశ్శబ్దంగా ఉండడం అంతర్జాతీయ దౌత్యంలో భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లను సూచిస్తుంది. రెండురోజుల పాటు రక్షణమంత్రుల స్థాయిలో మేధోమథనం జరిగిన తరువాత, సదస్సు ముగింపు సందర్భంగా విడుదల చేద్దామనుకున్న ఉమ్మడి ప్రకటన భారత్ అభ్యంతరాల నేపథ్యంలో నిలిచిపోయింది. పహల్గాం ఊసులేనం దుకు అభ్యంతరం వెలిబుచ్చుతూ సంతకం చేయడానికి మన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిరాకరించారు. ఉగ్రవాదంమీద కలసికట్టుగా పోరాడదామని సంకల్పించి, ఒక భయానకమైన ఉగ్రదాడి జరిగిన తరువాత కూడా, ఒక దేశం అభ్యంతరం వెలిబుచ్చిందనో, దానికి ఆగ్రహం కలుగుతుందనో సంయుక్త ప్రకటనలో సదరు సంఘటన ప్రస్తావన లేకుండా చేయడం ద్వంద్వప్రమాణాలకు నిదర్శనమని రాజ్‌నాథ్ విస్పష్టంగా ప్రకటించారు. శాంతి, భద్రత, పరస్పర విశ్వాసం ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళనీ, శాంతి, ఉగ్రవాదం ఒక ఒరలో ఇమడవని ఆయన గుర్తుచేశారు. రాజ్‌నాథ్ తన ప్రసంగంలో ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. లష్కరే తోయిబా జరిపిన గతకాలపు ఉగ్రదాడులు, ఇప్పుడు దాని అనుబంధ సంస్థ చేసిన పహల్గాం ఉగ్రదాడి, ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఇత్యాది అంశాలతో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం ఎంతో లోతుగా సాగింది. భారత్ ప్రతీకారం తీర్చుకుందని, ఉగ్రవాద కేంద్రాలను దుంపనాశనం చేసిందని, ఈ నేపథ్యంలో సభ్యదేశాలన్నీ ఉగ్రవాదాన్ని ఖండించాలన్నది ఆ ప్రసంగ సారాంశం. పాకిస్థాన్‌పై అంతటి విమర్శ దట్టించిన ఆ ప్రసంగం తరువాత, ఉమ్మడి ప్రకటనలో ఉగ్రవాదం ఊసెత్తనివ్వకుండా ఏ దేశం అడ్డుపడిందో ఊహించడం కష్టం కాదు. సదస్సు సవ్యంగా, సయోధ్యతో ముగిసిందని చైనా తేల్చేసింది. సంతకం చేయకపోవడంపై భారత్‌ను వెనకేసుకొస్తున్నవారు ఉన్నట్టే, వ్యతిరేకిస్తున్నవారూ ఉంటారు. పహల్గాం ప్రస్తావన లేకపోవడం కంటే, బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ఈ సహకార సంస్థలోని సభ్యదేశాలన్నీ ఐకమత్యంగా ఖండించడం భారత్‌కు ఆగ్రహం కలిగించిందని, పాకిస్థాన్ సాధించిన ఈ దౌత్యవిజయం భారత్‌ను ఇరకాటంలో పడవేసిందని విశ్లేషకులు అంటున్నారు. పహల్గాం దారుణం, పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదం ప్రస్తావనలు లేకుండా, ఒక అంతర్జాతీయ వేదిక కేవలం బలూచిస్థాన్ గురించి మాట్లాడటమంటే మన దౌత్యవిధానం విఫలమైనట్టేనని విపక్షనేతల విమర్శ. మోదీ ఏలుబడిలో భారత్ ఏకాకి అయిపోయింది, మిగతా ప్రపంచంముందు మనకు అవమానాలు మిగులుతున్నాయి, పాకిస్థాన్‌కు బిలియన్ల కొద్దీ డాలర్లు సాయంగా అందుతూంటే, ఉగ్రవాదాన్ని కనీసంగా ఖండించడానికి కూడా మనపక్షాన ఎవరూ నిలవడం లేదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది. ఈ సహకార సంస్థ ఆవిర్భావ లక్ష్యాలను, ఆశయాలను అటుంచితే, ఈ సంస్థలో కీలకపాత్రలు, పాత్రధారులు ఎవరో తెలిసిందే గనుక, ఉమ్మడి ప్రకటనలో మార్చి 11న బలూచ్ లిబరేషన్ ఆర్మీ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం గురించి మాత్రమే గుండెలు బాదుకొని, మరుసటి నెలలోనే పాతికమంది పర్యాటకులను పహల్గాంలో ఊచకోతకోసిన దారుణాన్ని అలవోకగా విస్మరించడం ఆశ్చర్యం కలిగించదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేదికమీద మనం ఒంటరి కావడంలోనూ విశేషమేమీలేదు. పాకిస్థాన్‌ను నొప్పించడం ఇష్టంలేకపోవచ్చు సరే, దానిని మెప్పించడానికి చైనా ఇంత నిస్సిగ్గుగా సిద్ధపడటమే ఆశ్చర్యం కలిగిస్తుంది.

భక్తి

## పతితపావనుడు శ్రీ జగన్నాథుడు



జగన్నాథుడి రథయాత్ర... భక్తులు అంగరంగంగా జరుపుకొనే ఒక మహోత్సవం. సాక్షాత్తూ శ్రీకృష్ణుడి ప్రతిరూపమైన శ్రీజగన్నాథస్వామి... బలభద్ర, సుభద్రలతో కలిసి... భక్తులను అనుగ్రహించడానికి ఆలయం నుంచి బయటకు వచ్చే దివ్యమైన సందర్భం అది.

జగన్నాథుడి రథోత్సవం జనన మరణ చక్రానికి అడ్డుకట్టవేసి, మోక్షమార్గాన్ని సులభంగా అనుగ్రహించగలదని పురాణాలు చెబుతున్నాయి.

ఒడిశాలోని పూరీలో ఉన్న, అత్యంత పురాతనమైన శ్రీ జగన్నాథుడి ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే కన్నుల పండుగ... జగన్నాథ రథయాత్ర. ఇది ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ విదియ నాడు ప్రారంభమవుతుంది. భగవంతుణ్ణి ఆలయంలో దర్శించుకోలేని భక్తులకు... ఆ జగన్నాథుడే స్వయంగా రథంపై వచ్చి దర్శన భాగ్యం కల్పిస్తాడు. అందుకే ఆయనను 'పతిత పావనుడు' అంటారు. 'రథస్థం కేశవం దృష్ట్వా.. పునర్జన్మ న విద్యతే... రథంపై కొలువై ఉన్న జగన్నాథ స్వామిని దర్శించినవారు పునర్జన్మ నుంచి విముక్తి పొందుతారు' అనేది శాస్త్రవాక్యం.

జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అసంపూర్ణమైన కరచరణాలతో, ప్రత్యేక రూపాలతో కనిపించడం వెనుక ఒక లీల ఉంది. ఒకసారి కురుక్షేత్రంలో, సూర్యగ్రహణ సమయంలో... శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర తమ బాల్య లీలలను రోహిణీ మాత నుంచి వింటూ పరవశించిపోయారు. అప్పుడు వారి దేహాలు విశాలమైన కళ్ళతో, లోపలికి చొచ్చుకుపోయిన కరచరణాలతో రూపాంతరం చెందాయి. అవి వ్రజ వాసుల మాధుర్య, ప్రేమ భావనలకు ప్రతిరూపాలుగా పూజలందుకుంటున్నాయి.

గుండిచాలో విడిది

రథయాత్రలో జగన్నాథుడు (సాక్షాత్తు శ్రీకృష్ణుడు), బలభద్రుడు (బలరాముడు), సుభద్ర (శ్రీకృష్ణుని సోదరి) వేర్వేరు రథాల మీద కొలువై కదులుతారు. జగన్నాథుడి రథాన్ని 'నందిఘోష' అంటారు ఇది 16 చక్రాలతో 44 అడుగుల రెండంగుళాల ఎత్తులో ఉంటుంది. బలభద్రుడి రథాన్ని 'తాళధ్వజం' అంటారు. దానికి 14 చక్రాలుంటాయి ఎత్తు 43 అడుగుల మూడంగుళాలు. సుభద్ర రథం పేరు 'దేవదళన'. దీనికి 12 చక్రాలుంటాయి, ఎత్తు 42 అడుగుల మూడంగుళాలు ఉంటుంది. ఈ రథయాత్ర ప్రధాన ఆలయం దగ్గర మొదలై గుండిచా మందిరం వరకూ సాగుతుంది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు తొమ్మిదిరోజులపాటు గుండిచా మందిరంలో బస చేస్తారు. మూడు రోజుల తరువాత ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు లక్ష్మీదేవి గుడించా మందిరానికి వెళ్ళి, స్వామిని తిరిగి రమ్మని చెప్పి, కోపంగా వెనక్కు తిరిగి వస్తుంది. చివరకు స్వామివారు తమ మందిరానికి చేరుకొని, బంగారు ఆభరణాలతో దర్శనమిచ్చే 'సోనాబేష'తో రథయాత్ర ముగుస్తుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదుల కృషి ఫలితంగా ఇప్పుడు ప్రపంచంలోని అన్ని ఖండాలలో, ప్రతి ప్రఖ్యాత నగర వీధుల్లో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నారు. 1967లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో తొలిసారిగా అంతర్జాతీయ రథయాత్రను నిర్వహించారు. కుల, మత, వర్గ భేదం లేకుండా.. ప్రతి ఒక్కరికీ భగవంతుణ్ణి సేవించే అవకాశాన్ని ఈ ఉత్సవం అందిస్తుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
మంగళవారం
01 । జులై 2025




# భారతీయ సిబ్బందితో వెళ్తున్న నౌకలో అగ్నిప్రమాదం.. కాపాడిన నేవీ



**జమ్మూ - నవభూమి:** పులావు జెండాతో 'ఎం.టి. యి చెంగ్ 6' అనే ఆయిల్ ట్యాంకర్ 14 మంది భారతీయ సిబ్బందితో గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవు నుంచి ఒమన్‌లోని షినాస్‌కు బయల్దేరింది. మార్గం మధ్యలో ట్యాంకర్ ఇంజిన్ రూములో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో నౌకలోని విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అందులోని సిబ్బంది నిస్సహాయ స్థితిలో నడి సముద్రంలో చిక్కుకుపోయారు. సహాయం కోసం డిస్ట్రెస్ కాల్ పంపారు. ఒమన్ గల్ఫ్‌లో గస్తీ కాస్తున్న భారత నౌకాదళానికి చెందిన 13 మంది భారతీయ నావికాదళ సిబ్బంది, ఐదు మంది సిబ్బందితో కూడిన ఐఎన్ఎస్ తబార్ స్టెల్త్ యుద్ధనౌక వెంటనే రంగంలోకి దిగింది. అక్కడ సహాయక చర్యలు చేపట్టింది. మంటలను అదుపు చేసింది. అందులోని సిబ్బందిని రక్షించింది.

## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తుతున్న భారీ వర్షాలు.. హిమాచల్‌కు రెడ్ అలర్ట్



**ఉత్తరాఖండ్-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు పొంగి పొర్లుతున్నాయి. ఈ వర్షాలకు పలుచోట్ల వరదలు సంభవిస్తున్నాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా హిమాచల్ ప్రదేశ్ లోని 10 జిల్లాలకు భారత వాతావరణ శాఖ వరద హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. బిలాస్‌పూర్, సోలన్, సిమ్లా, సిర్మౌర్, హమీర్‌పూర్, మండి, కాంగ్రా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. 'కులు, ఉనా, చంబా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది' అని తెలిపింది. రాబోయే 3 నుండి 4 గంటల్లో కిన్నౌర్, లాహుల్, స్పితి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు గత 24 గంటల్లో రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురిశాయని, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైందని ఐఎండీ సిమ్లా కేంద్రంలోని సీనియర్ అధికారి సందీప్ కుమార్ శర్మ తెలిపారు. ఇక భారీ వర్షాల కారణంగా అనేకచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా దాదాపు 129 రహదారులను మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సోలన్‌లో ఓ వంతెన కొట్టుకుపోయింది. రెడ్ అలర్ట్ నేపథ్యంలో పలు జిల్లాల్లో పాఠశాలలకు అధికారులు నేడు సెలవు ప్రకటించారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచి రాష్ట్రంలో 20 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా బియాస్ నది (%దీమ్రం =ఐజవతీ%)కి వరద తీవ్రత పెరిగింది. దీంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అబద్ధాలు చెప్పడం బీజేపీ జాతీయ విధానం : సంజయ్ రౌత్



**ముంబై- నవభూమి:** మహారాష్ట్రలో త్రిభాషా విధానం పై అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం కొనసాగుతోంది. పాఠశాలల్లో త్రిభాషా విధానాన్ని అమలు చేసేందుకు అధికారపక్షం ప్రయత్నాలు చేస్తుండగా.. తాము వ్యతిరేకమని ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలకు దిగుతున్నాయి. ఈ క్రమంలో త్రిభాషా విధానంపై గతంలో మాషేల్కర్ కమిటీ ఇచ్చిన నివేదికకు యూబీటీ శివసేన పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే అంగీకారం తెలిపారని బీజేపీ ఆరోపించింది. అయితే బీజేపీ ఆరోపణలను యూబీటీ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తిప్పికొట్టారు. అబద్ధాలు మాట్లాడటం బీజేపీ జాతీయ విధానంగా మారిపోయిందని, మహారాష్ట్రలో వాళ్లు ఈ విధానంతోనే పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. మాషేల్కర్ కమిటీ నివేదికకు ఉద్ధవ్ థాకరే అంగీకారం తెలిపి ఉంటే అందుకు సంబంధించిన ఆధారాలు బయటపెట్టవచ్చుగా అని మండిపడ్డారు. అసలు మాషేల్కర్ నివేదిక నాడు క్యాబినెట్ ముందుకు వచ్చిందా.. క్యాబినెట్‌లో దానిపై చర్చ జరిగిందా..? అని సంజయ్ రౌత్ ప్రశ్నించారు. ఏదైనా జాతీయ విధానం రాష్ట్రం ముందుకు వచ్చినప్పుడు దానిపై చర్చ జరగడం అనేది చాలా ముఖ్యమని, మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి అయిన దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఈ విషయం కూడా తెలియదా..? అని రౌత్ ప్రశ్నించారు. కాగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా మహారాష్ట్రలోని ప్రాథమిక పాఠశాలల్లో కూడా హిందీని ఒక బోధనా భాషగా ప్రవేశపెట్టాలని ఫడ్నవీస్ సర్కారు ప్రయత్నిస్తోంది. అయితే ప్రాథమిక పాఠశాల స్థాయిలో హిందీని బలవంతంగా ఒక బోధనా భాషగా చేర్చడం కరెక్టు కాదని ప్రతిపక్ష శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ నిరసనలకు దిగుతున్నాయి.

## బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై అత్యాచారం.. స్థానిక రాజకీయ నేత అరెస్ట్



**బంగ్లాదేశ్ - నవభూమి:** బంగ్లాదేశ్ లో దారుణ ఘటన వెలుగు చూసింది. 21 ఏళ్ల హిందూ మహిళ పై స్థానిక రాజకీయ నేత ఒకరు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనకు వ్యతిరేకంగా ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడితోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటన జూన్ 26న చోటు చేసుకుంది. ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) సభ్యుడు 38 ఏళ్ల ఫిరోజ్ అలీ రాత్రి 10 గంటల ప్రాంతంలో ఒంటరిగా ఉన్న మహిళ ఇంటికి వెళ్లి తలుపుకొట్టాడు. ఆమె తలుపు తీసేందుకు నిరాకరించడంతో తోసుకుని వెళ్లి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. నిందితుడిని పట్టుకుని చితకబాదారు. అయితే, వారి నుంచి అలీ తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు జూన్ 27న పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న మురాద్‌నగర్ పోలీసులు.. ఢాకాలోని సయదాబాద్ ప్రాంతంలో ఫిరోజ్ అలీని అరెస్టు చేశారు. అతడితోపాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ అమానుష ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'డైరెక్ట్ యాక్షన్' తీసుకోవాలంటూ నినాదాలతో హోరెత్తించారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం అధికారం కోల్పోయినప్పటి నుంచి హిందూ మైనారిటీలపై దాడులు పెరిగాయని స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### 3 సార్లు ప్లాన్లు గీసి.. 90డిగ్రీల బ్రిడ్జ్ కట్టారు..

# ఏడుగురు ఇంజినీర్లు సస్పెండ్.. రూ.18 కోట్లు మటాష్!



**భోపాల్-నవభూమి:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 90 డిగ్రీల మలుపుతోనిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అసాధారణ డిజైన్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు, మీమ్స్ వెల్లువెత్తాయి. నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి తాజాగా కీలక చర్యలకు ఉపక్రమించింది. ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే ఈ నిర్మాణ సమయంలో జరిగిన కీలక విషయాలు తాజాగా బయటకు వచ్చాయి. భోపాల్‌లో ఐష్‌బాగ్ ప్రాంతంలోని ఆర్వోబీ రూపకల్పనలో అనేక మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. గత ఏడేళ్లలో పీడబ్ల్యూడీ రైల్వే శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో మూడుసార్లు డిజైన్‌ను మార్చారని సమాచారం. ఈ డిజైన్ మార్పులు, ఇతర సమస్యలపై విచారణ నివేదిక సిద్ధంగా ఉందని పీడబ్ల్యూడీ అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. విచారణ నివేదిక ఆధారంగా పీడబ్ల్యూడీకి చెందిన ఎనిమిది మంది ఇంజినీర్లపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఏడుగురు ఇంజినీర్లను సస్పెండ్ చేశామని, రిటైర్డ్ సబ్-ఇంజినీర్‌పై విచారణ జరుపుతామని ఆయన తెలిపారు. నిర్మాణ సంస్థను, డిజైన్ కన్సల్టెంట్‌ను బ్లాక్‌లిస్ట్ చేశామని కూడా ఆయన పేర్కొన్నారు. అధికారిక రికార్డుల ప్రకారం.. మొదటి డిజైన్‌ను 7 జూలై 2018న ఖరారు చేశారు. దీన్ని రైల్వే, మధ్యప్రదేశ్ ఇంజనీర్లు పరిశీలించారు. ప్రతిపాదిత ఆర్వోబీకి.. రోడ్ అలైన్మెంట్‌కు 45 డిగ్రీల కోణంలో ఉండాలని వారు తేల్చారు. అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమర్పించిన నివేదికలో.. "రైల్వే బౌండరీ పరిధిలో.. 45 డిగ్రీల కోణంలో వంతెన నిర్మాణం ఉంటుంది. రెండు వైపులా పీడబ్ల్యూడీ అప్రోచ్‌లను నిర్మిస్తుంది" అని ఉంది. అయితే, "ఆర్వోబీ నిర్మాణం రైల్వే భూమిలో జరగాల్సి ఉండటంతో, రైల్వే శాఖ దీనికి అంగీకరించలేదు. దీంతో పీడబ్ల్యూడీ టెండర్ ప్రక్రియను నిలిపివేసింది." అని పీడబ్ల్యూడీ అంతర్గత రికార్డుల్లో ఉంది. సెప్టెంబర్ 2020 నాటికి, పీడబ్ల్యూడీ, రైల్వే శాఖలు కలిసి ఒక కొత్త అలైన్‌మెంట్‌ను రూపొందించాయి. ఈసారి మెట్రో రైలు మార్గం కూడా ఆ ప్రాంతం గుండా వెళుతుండటంతో.. దాన్ని దృష్టిలో ఉంచుకుని డిజైన్ చేశారు. అనంతరం పీడబ్ల్యూడీ, రైల్వే శాఖల పరస్పర అంగీకారంతో, %=జజ% సర్క్యులర్ పిల్లర్ల నిర్మాణం ఆధారంగా కొత్త జనరల్ అరేంజ్‌మెంట్ డ్రాయింగ్ (%+ూణ%) తయారు చేశారు. అయితే తన జీఏడీలో తప్పులున్నట్లు ప్రాజెక్ట్ అమలు చేయడానికి ముందే రైల్వే శాఖకు తెలిపినట్లు పీడబ్ల్యూడీ చెప్పింది. ఇంత చెప్పినా.. రైల్వే శాఖ తన డ్రాయింగ్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా, తప్పు స్థానంలో నిర్మాణాన్ని చేపట్టిందని ఆరోపించింది. రైల్వే శాఖ చేసిన పొరపాటు కారణంగా, అలైన్‌మెంట్.. మెట్రో అలైన్‌మెంట్ వైపుకు జరుగుతోంది పేర్కొంది.
దీని తరువాత, మూడవ డిజైన్ మార్పు జరిగింది. పీడబ్ల్యూడీ ఒక సవరించిన %+ూణ%ని తయారు చేసింది. అందులో రైల్వే పిల్లర్ వెనుక ఒక అదనపు పిల్లర్‌ను నిర్మించారు. స్లాబ్‌ను ఈ అదనపు పిల్లర్ సపోర్ట్‌తో చేసి.. రైల్వే స్లాబ్‌కు కనెక్ట్ చేశారు. సవరించిన ప్రకారం.. మెట్రో రైలు అలైన్‌మెంట్ ముందులానే ఉంటుంది. మెట్రో రైల్ ప్రాజెక్ట్, రైల్వే శాఖలు.. తమ నిర్మాణ పనులను ముందుగా నిర్ణయించిన పరిమితుల్లో, అంగీకరించిన అలైన్‌మెంట్ల ప్రకారం చేసుకోవచ్చు. మరోవైపు, తన డ్రాయింగ్‌లో సమస్యలను గుర్తించే ముందే.. 4 ఏప్రిల్ 2024న పీడబ్ల్యూడీకి ఒక లేఖ రాశామని రైల్వే శాఖ తెలిపింది. పీడబ్ల్యూడీ, రైల్వే శాఖ నిర్మించిన వంతెన భాగాలు దాదాపు 90 డిగ్రీల కోణంలో కలుస్తున్నాయని.. ఇది ప్రయాణికులకు సురక్షితం కాదని చెప్పామని చెబుతోంది. ఏది ఏమైనా.. ఈ మొత్తం వ్యవహారంలో పీడబ్ల్యూటీ, రైల్వే శాఖల మధ్య సమన్వయం సరిగా లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల రూ.18 కోట్లు ఖర్చు చేసిన కట్టిన వంతెన ప్రజలకు ఉపయోగపడకుండా పోయినట్లైంది. ఈ క్రమంలో భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### పెద్దలు కుదిర్చిన పెళ్లికోసం అమెరికా వెళ్లిన

# భారతీయ యువతి అదృశ్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** పెద్దలు కుదిర్చిన వివాహం కోసం భారత్ నుంచి అమెరికాకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇండియా నుంచి వెళ్లిన ఆచూకీ లేకుండా పోయింది. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఆమెకు ఈ వివాహం ఇష్టం లేదా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఆమె మిస్సింగ్ వ్యవహారంపై న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం.. సిమ్రన్ అనే 24 ఏళ్ల యువతి.. జూన్ 20న భారత్ నుంచి అమెరికాకు చేరుకుంది. న్యూజెర్సీలోని లిండెన్‌వోల్డ్ ప్రాంతంలో ఆమె చివరిసారిగా కనిపించినట్టు తెలిపింది. ఆమె బ్లాక్ ఫ్లిప్ ఫ్లాప్స్, గ్రే కలర్ ప్యాంట్, వైట్ టీ షర్ట్ వేసుకుందని, వజ్రాల చెవిపోగులు ఉన్నట్టు పేర్కొంది. అయితే, అమెరికాలో వారి బంధువులు ఎవరూ లేరని, ఆమెకు ఇంగ్లీష్ రాదని, ఫోన్: కేవలం Wi-Fiలో మాత్రమే పనిచేస్తుందని వివరించింది. అయితే, ఇండియాలోని బంధువులు కూడా పోలీసులను సంప్రదించకపోవడం కేసు మరింత సంక్లిష్టమైంది. మానవ అక్రమ రవాణా లేదా కిడ్నాప్‌నకు గురైనట్టు అనుమానిస్తున్నారు. ఇంగ్లీష్‌పై కూడా అవగాహన లేకపోవడం వల్ల స్థానికుల సహాయం తీసుకోవడంలో ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. ఎవరైనా ఫేక్ మ్యారేజ్ ప్రామిస్ ద్వారా ఆమెను మోసపూరితంగా అమెరికాకు రప్పించి, మానవ అక్రమరవాణాకు పాల్పడి ఉంటారేమోనని భావిస్తున్నారు. ఈ ముఠాలు ఆమెను వదిలేయడం లేదా మరొకదిశగా తరలించారా? అనే సందేహాలు కలుగుతున్నాయి. జవిమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజ్‌లో ఆమె ఫోన్ చూస్తూ ఎవరి కోసమో ఆమె ఎదురుచూస్తున్నట్లు కనిపించినప్పటికీ, యువతి బాధలో ఉన్నట్లు కనిపించలేదని పోలీసులు పేర్కొన్నారు. అయితే, ఆ తర్వాత ఎక్కడికి వెళ్లిందో తెలియడం లేదు. భారత దౌత్య కార్యాలయాలు ఇంటర్నెట్‌లో ట్రేస్ చేయగలిగేలా ఆమె పాస్‌పోర్ట్, వీసా ఆధారంగా పర్యటన వివరాలు విశ్లేషించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలతో పోలీస్ విభాగం సంప్రదించి ఆమె ఆచూకీ కోసం తెలుసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన న్యూజెర్సీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఇంకా భారతీయ ఎంబసీ కూడా స్పందించాల్సి ఉంది. ఆమె ఏమైంది? అనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. అయితే, భారత్‌లో నుంచి ఏ ప్రాంతం నుంచి వచ్చిందో కూడా అక్కడి పోలీసులకు తెలియకపోవడం గమనార్హం. ఈ వివరాలు కూడా లేకపోవడం గమనార్హం.

## 800 గ్రాముల బంగారం, వోల్వో కారు ఇచ్చినా అదనపు కట్నం కోసం వేధింపులు.. నవ వధువు బలవన్మరణం



**తిరుప్పూర్-నవభూమి:** అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు తాళలేక నవ వధువు బలవన్మరణానికి పాల్పడింది. భర్తతో సంతోషంగా గడపాల్సిన ఆమె.. పెళ్లైన రెండు నెలలకే తనువుచాలించింది. ఈ ఘటన తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుప్పూర్ కు చెందిన వస్త్ర వ్యాపారి అన్నాదురై కుమార్తె రిధన్య (27)కు, కవిన్ కుమార్ (28) అనే యువకుడితో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రిధన్య తల్లిదండ్రులు కట్నం కింద 100 సవర్ల (800 గ్రాములు) బంగారం, రూ.70 లక్షల విలువైన వోల్వో కారు ను ఇచ్చారు. అయితే, పెళ్లై అత్తారింటికి వెళ్లిన రిధన్యకు అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. భర్త, అత్తమామలు.. రిధన్యను నిత్యం మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలు పెట్టారు. అత్తింటి వేధింపులు తాళలేక రిధన్య తనువు చాలించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మొండిపాలయంలోని ఆలయానికి వెళ్తున్నానని చెప్పి కారులో బయల్దేరింది. మార్గం మధ్యలో ఓ చోట కారు ఆపి.. అందులోనే పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కారు చాలాసేపు అక్కడ ఆగి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కారులో రిధన్య మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ఆత్మహత్యకు ముందు రిధన్య తన తండ్రికి వాట్సాప్‌లో ఏడు ఆడియో సందేశాలు పంపినట్లు గుర్తించారు.
అందులో తన ఆవేదనను వెళ్లగక్కింది. వేధింపులను భరించలేకపోతున్నానని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపింది. ఈ మేరకు తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పింది. 'నన్ను కవిన్‌కి ఇచ్చి పెళ్లి చేయాలని వాళ్లు ముందే పథకం వేశారు. వాళ్లు పెట్టే మానసిక హింసను భరించలేకపోతున్నాను. ప్రతి ఒక్కరూ జీవితం అంటే అంతే.. సర్దుకుపోవాలనే చెబుతున్నారు. కానీ, నా బాధను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. నేను జీవితాంతం మీకు భారంగా ఉండాలనుకోవట్లేదు. నేను ఏ తప్పూ చేయలేదు. నాకు ఈ జీవితం నచ్చట్లేదు. అతను (భర్తను ఉద్దేశిస్తూ) నన్ను శారీరకంగా హింసిస్తుంటే.. అత్తమామలు మానసికంగా వేధిస్తున్నారు. ఇక నేను బతకలేను. నన్ను క్షమించండి నాన్నా' అంటూ తన ఆవేదనను తండ్రికి తెలియజేసింది. రిధన్య మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు తమ కుమార్తెకు న్యాయం చేయాలని ఆమె బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు రిధన్య భర్త, అత్తమామలను అరెస్ట్ చేశారు. ఈ మేరకు వారిని విచారిస్తున్నారు.

### వారు అల్లాహ్ శత్రువులు.. ట్రంప్, నెతన్యాహులపై

# ఫత్వా జారీచేసిన ఇరాన్ ముఖ్య మతపెద్ద




**అమెరికా-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నేతన్యాహూలపై ఇరాన్ ముఖ్య మతపెద్ద ఫత్వా జారీచేశారు. వారిని ""భగవంతునికి శత్రువులు' గా ప్రకటిస్తూ షియా మతపెద్ద గ్రాండ్ ఆయతుల్లా నసెర్ మకారెం షిరాజీ మతపరమైన తీర్పు ఇచ్చారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని భయపెట్టే ఏ వ్యక్తి అయినా లేదా పాలక వ్యవస్థ అయినా 'మోహారెబ్' (దైవంతో యుద్ధం చేసే వ్యక్తి)గా పరిగణింపబడతారు' అని ఫత్వాలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలందరూ అమెరికా, ఇజ్రాయెల్ పాలకులను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న తమిళ నటుడు, టీవీకే అధినేత విజయ్‌కు ఇటీవల ముస్లింలు ఫత్వా జారీచేసిన సంగతి తెలిసిందే.

**మోహారెబ్ అంటే ఏమిటి?**
మోహారెబ్ అనేది ఇస్లామిక్ న్యాయవ్యవస్థ ప్రకారం దైవంపై యుద్ధానికి దిగిన వ్యక్తి అని అర్థం.. ఇరాన్ మోహారెబ్‌గా గుర్తించివారిపై కఠిన శిక్షలు విధించవచ్చు: ఉరి, అవయవాల తొలగింపు, శిలువ వేయడం, దేశ బహిష్కరణ వంటివి ఇందులో ఉంటాయి. 'ఈ నాయకులను సమర్థించేవారు లేదా సహకరించే ఇస్లామిక్ దేశాలు, ముస్లింలు హరామ్ (నిషిద్ధం) చేసిన పాపానికి పాల్పడినవారే' అని పేర్కొన్నారు. ఈ నాయకుల పట్ల తమ తప్పులను గుర్తించేలా చేయాలని ముస్లింలను ఆయన కోరారు. "దైవ మార్గంలో పోరాడే ముస్లింలు కష్టాలు ఎదుర్కొన్నా, వారికి పరలోక ప్రాప్తి లభిస్తుంది" అని హామీ ఇచ్చారు. జూన్ 13 ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై వైమానిక దాడులు ప్రారంభించింది. అణు శాస్త్రవేత్తలు, సైనిక అధికారులు హతమయ్యారు. ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లతో ఇజ్రాయెల్ పట్టణాలపై విరుచుకుపడింది. ఈ క్రమంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో కలిసి ఫోర్డో, నటాంఝ్, ఇస్ఫహాన్‌లో అణు కేంద్రాలపై దాడి చేసింది. దీనికి ప్రతిస్పందనంగా ఖతార్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడులు చేపట్టింది.

**ఫత్వా అంటే ఏమిటి?**
ఫత్వా అనేది షియా మతంలోని మార్జా (ఉన్నత మతపెద్ద)లు జారీ చేసే మత న్యాయ తీర్పు.. ఇది ముస్లిం ప్రభుత్వాలు, వ్యక్తులు పాటించాల్సిన మతాధికారపు ఆదేశంగా పరిగణిస్తారు. ఈ తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ప్రపంచ ముస్లింలపై ఉంటుంది. 1989లో రచయిత సల్మాన్ రష్దీపై కూడా అప్పటి ఇరాన్ గ్రాండ్ ఆయతుల్లా అయతుల్లా ఖమేనీ ఫత్వా జారీ చేశారు. 'ది సాటానిక్ వర్సెస్' పుస్తకాన్ని అవమానకరంగా భావించి, రష్దీని హత్య చేయాలంటూ పిలుపునిచ్చారు. దీంతో జపాన్ అనువాదకుడి హత్యకు గురికాగా.. పబ్లిషర్లపై దాడులు చేపట్టారు. 2023లో రష్దీపై కొరడాతో దాడి చేయడంతో

# సెల్ఫ్ డ్రైవ్ చేసుకుంటూ ఫ్యాక్టరీ నుంచి యజమానికి ఇంటికి టెస్లా కారు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోని ఎంతో మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ కారు వచ్చేసింది. అమెరికాకు చెందిన ఆటోమోటివ్, క్లీన్ ఎనర్జీ దిగ్గజం టెస్లా మొట్టమొదటి సెల్ఫ్ డ్రైవింగ్ కారు జర్నీ వీడియోను పంచుకుంది. అసలు మానవ నియంత్రణ లేకుండా ఫ్యాక్టరీ నుంచి నేరుగా యజమాని ఇంటికి కారు డెలివరీ అయింది. 'టెస్లా మోడల్ వై' పేరుతో తీసుకొచ్చిన ఈ కారు కేవలం 30 నిమిషాల్లోనే హైవేలు, ట్రాఫిక్ సిగ్నళ్లు దాటుకుంటూ ప్రయాణించింది. ఇందుకు సంబంధించిన వీడియోను కంపెనీ ఎక్స్‌లో పోస్ట్ చేయగా, ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. ఫ్యాక్టరీ నుంచి బయలుదేరిన కారు.. రహదారిపై ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వేగాన్ని నియంత్రించుకుంటూ దారిలో ఎదురయ్యే మలుపులు, ట్రాఫిక్ సిగ్నళ్లు, పక్క నుంచి వెళ్లే ఇతర వాహనాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లింది. యజమాని ఇంటికి చేరాక స్వయంగా పార్కింగ్ ప్రదేశానికి వెళ్లి నిలిచింది. ఈ మేరకు టెస్లా సంస్థ సీఈఓ, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేసి.. టీమ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ కారు లోపల ఎవరూ లేరు. బయట నుంచి కూడా ఎవరు ఆపరేట్ చేయలేదు. ఇది పూర్తిగా ఆటోమేటిక్ ప్రయాణం. డ్రైవర్ లేకుండా, రిమోట్‌తో ఆపరేట్ చేయకుండా రహదారులపై జరిగిన మొట్టమొదటి ప్రయాణం కూడా ఇదే కావొచ్చు' అని మస్క్ పేర్కొన్నారు.
కారు దాదాపు గంటకు 115 కిలోమీటర్ల వేగాన్ని సైతం అందుకుందని టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ ఎల్లుస్వామి వెల్లడించారు. ఆస్టిన్‌లో జూన్ 22న టెస్లా తన రోబోట్యాక్సీ పరీక్షలను ప్రారంభించింది. ఆ సమయంలో కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లకు ఈ మోడల్ వై సెల్ఫ్‌డ్రైవింగ్ కారులో ప్రయాణించే అవకాశం కల్పించింది. భవిష్యత్తులో లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీలను అందుబాటులోకి తేవాలని టెస్లా లక్ష్యంగా పెట్టుకుంది.
ఇదిలా ఉండగా.. భారత్‌లోకి త్వరలోనే టెస్లా ఈవీ కారు ల్యాండ్ కానుంది. దీనిపై ఇప్పటికే ఎలాన్ మస్క్ కంపెనీ ఒప్పందాలు చేసుకుంది. వాస్తవానికి కార్ల తయారీ ఫ్యాక్టరీని భారత్‌లోనే ఏర్పాటుచేస్తారనే ప్రచారం జరిగింది. కానీ, కేవలం షోరూమ్‌లు మాత్రమే ప్రారంభిస్తున్నట్టు అటు కేంద్రం, ఇటు టెస్లా క్లారిటి ఇచ్చింది. చైనాలో తయారైన ఎలక్ట్రిక్ వాహనాలతోనే షోరూమ్‌లు ప్రారంభిస్తారు. టెస్లా ఇంక్ మొదటి షోరూమ్‌లు జూలైలోనే ప్రారంభమవుతాయి.. మోడల్ వై రియర్-వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ వాహనాలు ఇప్పటికే దేశానికి చేరుకున్నాయి. ముంబైలో తొలి షోరూమ్, ఆ తర్వాత న్యూఢిల్లీలో రెండో షోరూమ్ తెరవనున్నారు.



## దుస్తుల నుంచి దుర్వాసన

వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. దాంతో ఉతికిన దుస్తులు సరిగ్గా ఆరక దుర్వాసన వస్తాయి. అలాగే అల్మారాల్లోని దుస్తుల నుంచి కూడా వాసన వస్తుంది. ఇలా కాకుండా ఉండాలంటే చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరి. అవేంటో తెలుసుకుందాం..నిమ్మరసం ఈ సమస్యను చక్కగా పరిష్కరిస్తుంది. ఒక చెంచా నిమ్మరసంలో కొంచెం నీరు కలిపి ఓ స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఆ నీటిని వాసన వస్తున్న బట్టల మీద స్ప్రే చేసి గాలికి ఆరబెట్టాలి. నిమ్మరసం వాసన కలిగించే ఫంగస్ చంపి దుర్వాసనను తొలగిస్తుంది.వెనిగర్ కూడా దుర్వాసనకు కారణమయ్యే ఫంగస్‌ను నివారించడంలో బాగా పనిచేస్తుంది. వెనిగర్‌ను దుస్తుల మీద చల్లి నీళ్లతో శుభ్రం చేసి ఆరేస్తే దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది.

వర్షాకాలంలో అల్మారాల్లో ఉన్న బట్టలు కూడా దుర్వాసన వెదజల్లుతాయి. అలాంటప్పుడు అల్మారాల మూలల్లో కొంచెం బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితముంటుంది.అల్మారాలను బ్లీచింగ్ ద్రావణంలో ముంచిన వస్త్రంతో తుడిచి ఆరిన తరువాత దుస్తులను సర్దుకోవాలి. ఇలా చేసినా దుర్వాసన రాదు.వాడేసిన బట్టలను ఎప్పటికప్పుడు ఉతకడం, వాషింగ్ మెషీన్‌లో ఉతికిన బట్టలను వెంటనే ఆరేసినా దుర్వాసన రాదు.తడిసిన బట్టలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వెంటనే ఉతికేయాలి. గాలి బాగా తగిలే ప్రదేశంలో ఆరేస్తే దుస్తుల నుంచి వాసన రాకుండా ఉంటుంది.



# వీల్‌చైర్స్‌తో... వైకల్యాన్ని గెలిచి!





నడవలేని వారికి ఎక్కువగా అందుబాటులో ఉండేవి... చేతులతో బలంగా నెట్టనిదే ముందుకు కదల్లేని చక్రాల కుర్చీలే. బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు కొనే స్థోమత అందరికీ ఉండదు. ఈ ఇబ్బందులను స్వయంగా అనుభవించిన డాక్టర్ నల్లూరి హిమబిందు... తక్కువ ధరకే ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్‌ను రూపొందిస్తూ, దివ్యాంగుల అవసరాలను తీరుస్తున్నారు.

మాది ఒంగోలు. అక్కడే పుట్టి పెరిగాను. వైద్య విద్యలో ఫీటల్ మెడిసిన్ నా స్పెషాలిటీ. ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ఫీటల్ అటాప్సీ కన్సల్టెంట్‌గా పని చేశాను. ప్రస్తుతం రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఫీటల్ మెడిసిన్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. అమ్మ భూమా నాగేశ్వరమ్మ, ప్రభుత్వ టీచర్. మేం ముగ్గురు పిల్లలం. నాకు అక్క, అన్న. నేను చివరిదాన్ని. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం కోసం నిర్వహించిన 'టై' (ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) విమెన్స్ గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ రీజనల్ ఫైనల్స్‌లో... మొదటి రన్నర్‌పగా గుర్తింపు సాధించాను.

“ఏడాది వయసుకే పోలియో బారిన పడ్డాను. సర్జరీ చేసిన తర్వాత, క్యాలిపర్స్‌తో పడుతూ లేస్తూ నడక కొనసాగించాను. కానీ బాత్రూమ్‌లో పట్టుతప్పి పడిపోయి, భుజానికి దెబ్బ తగలడంతో సర్జరీ చేయించుకోవలసి వచ్చింది. క్యాలిపర్స్ సహాయంతో నడవగలిగినా... వాటి వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయి కాబట్టి చక్రాల కుర్చీకే పరిమితమవడం మేలని నిర్ణయించుకున్నాను. అయితే కానీ ఎక్కడ వెతికినా, సాదాసీదా చక్రాల కుర్చీలే కనిపించాయి. కానీ వాటిని ఉపయోగించాలంటే ఇతరుల సహాయం కావాలి. తోడు లేకుండా ఎక్కడికీ వెళ్లలేను. అది నాకు ఇష్టం లేదు. స్వతంత్రంగా నడుపుకొంటూ వెళ్లగలిగే వీల్ చైర్ కావాలి. కానీ అలాంటి ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ మన దగ్గర ఎక్కడా కనిపించలేదు. దాంతో గత్యంతరం లేక.. 2016లో, రెండున్నర లక్షల ఖర్చుతో, తైవాన్ నుంచి ఒక ఎలక్ట్రిక్ వీల్‌చైర్ దిగుమతి చేసుకున్నాను. ఏడాది తర్వాత ఢిల్లీలో ఒక కాన్ఫరెన్స్‌కి హాజరైనప్పుడు, అకస్మాత్తుగా వీల్‌చైర్ బ్యాటరీ డిశ్చార్జ్ అయిపోయింది. దాన్ని చేతులతో నడిపించలేం! మరమ్మతు చేయించాలని ఎంత ప్రయత్నించినా... వాటి స్పేర్ పార్ట్స్ దొరకలేదు. సర్వీసింగ్ లేదు. చివరకు ఆ ఎలక్ట్రిక్ కుర్చీని అలాగే ఇంటికి తీసుకొచ్చేశాను. తర్వాత బ్యాటరీని స్థానికంగా రిపేర్ చేయించాను. ఛార్జింగ్ పెట్టి, అలారం వచ్చిన తర్వాత డిస్కనెక్ట్ చేశాను. అది పండుగ రోజు. మా కుటుంబ సభ్యులం అందరం ఇంటి బయట వేడుకలో పాల్గొంటున్నాం. ఆ సమయంలో ఇంట్లో నుంచి హఠాత్తుగా పెద్ద శబ్దం వచ్చింది. కుర్చీకి బిగించి ఉన్న బ్యాటరీ పేలిపోయి, ఇంట్లోని సామానంతా ధ్వంసమైపోయింది. ఈ సంఘటనతో నాలో ఆలోచన మొదలైంది. మన దేశంలో ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ తయారుచేయకపోవడం వెనుక ఉన్న కారణాల గురించి లోతుగా పరిశోధించాను. వాటిని తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెస్తే, ఎంతోమంది దివ్యాంగుల ఇబ్బందులు తీరతాయనిపించింది. అలా ఆ ఆలోచన నుంచే, “ఈజీలైఫ్ వీల్‌చైర్' సంస్థ రూపం పోసుకుంది.

**అవరోధాలను అధిగమించి...** మొదట్లో చైనా నుంచి కొన్ని ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్, స్పేర్ పార్ట్స్ తెప్పించాం. వాటికి సర్వీసింగ్ చేయగలిగే నిపుణులను నియమించుకొని, అమ్మకాలు మొదలుపెట్టాం. 2020లో కొవిడ్ సమయంలో దిగుమతులకు అవరోధం ఏర్పడింది. దీనికి తోడు అదే సమయంలో, మన దేశానికి చైనాతో విభేదాలు పెరగడంతో, చైనా ఉత్పత్తుల పట్ల దేశవ్యాప్తంగా అయిష్టత ఏర్పడింది. ఈ పరిస్థితి మాకు ఆటంకంగా మారింది. దాంతో చైనా నుంచి దిగుమతికి స్వస్తి చెప్పి, స్థానికంగా చెన్నై ఐఐటీని సంప్రతించాం. కానీ వాళ్లు తయారుచేసి అందించే మోడల్... దిగుమతి చేసుకున్న మోడల్ కంటే ఖరీదైనది కావడంతో స్వయంగా మేమే ఎలక్ట్రిక్ కుర్చీల తయారీకి పూనుకున్నాం. కొందరు ఐఐటీ విద్యార్థుల సాయంతో ఇంట్లోనే ఎలక్ట్రిక్ వీల్‌చైర్ తయారీ మొదలుపెట్టాం. అలా 2021లో ప్రొటోటైప్ ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను రూపొందించగలిగాం. అప్పటికే ఇండియా మార్ట్‌లో రిజిస్టర్ అయి ఉన్నాం. కాబట్టి ఆ వేదిక ద్వారా కుర్చీల అమ్మకాలు. మొదలుపెట్టాం.

**ఎన్నో రకాల వీల్‌చైర్స్..** వీల్‌చైర్స్‌లో ఎన్నో రకాలుంటాయి. దివ్యాంగుల అవసరాలకు తగ్గట్టు రూపొందే వీల్‌చైర్స్ కూడా ఉంటాయి. కాబట్టి వీటి ధరల్లో తేడాలుంటాయి. విదేశీ వీల్‌చైర్స్‌తో పోలిస్తే, 'ఈజీలైఫ్' వీల్‌చైర్స్ చవకగా దొరకడమే కాకుండా, వాటి విడిభాగాలను కొనుక్కోవచ్చు, ఇతరత్రా సర్వీసింగ్ సేవలు కూడా పొందవచ్చు. మరీ ముఖ్యంగా నేల మీద దోగాడుతూ కదిలే వైకల్యం కొందరికి ఉంటుంది. ఇలాంటి వాళ్లు చేతుల సహాయంతో పైకి లేవలేరు. ఇతరుల సహాయం లేకుండా కుర్చీలో కూర్చోలేరు. వాళ్ల కోసం 'గ్రౌండ్ లిఫ్టింగ్ వీల్‌చైర్'ను కూడా మేం తయారుచేశాం. దీనిలో చైర్ నేలకు సమాంతరంగా కిందకు చేరుకోగలుగుతుంది. దీని మీదకు చేరుకుంటే... అది నెమ్మదిగా పైకి లేస్తుంది. ఇలా ఏ ఎత్తు కావాలనుకుంటే ఆ ఎత్తుకు కుర్చీ కదులుతుంది. ఇలాంటి కుర్చీని దిగుమతి చేసుకోడానికి 3 నుంచి 4 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. మేం ఒకటిన్నర లక్షలకే ఇస్తున్నాం. ఇలా మా దగ్గర పది రకాల వీల్‌చైర్స్ అందుబాటులో ఉన్నాయి. దివ్యాంగులు కస్టమైజ్ కూడా చేసుకోవచ్చు. ఇప్పటివరకూ 400 వీల్‌చైర్స్ అమ్మకాలు జరిపాం.

**సవాళ్లను ఎదుర్కొని, వైద్యురాలిగా ఎదిగి...**

చిన్నప్పటి నుంచే నేను చదువరిని. దివ్యాంగురాలిగా నన్ను చిన్నచూపు చూసిన సందర్భాలు కూడా లేవు. కుటుంబసభ్యులు, స్నేహితులు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారే తప్ప, ఎప్పుడూ ఆత్మన్యూనతకు గురి చేయలేదు. అయితే డాక్టర్‌గా ఎదగాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. అందుకు కారణం నా వైకల్యం కాదు. ఎంతలా దేవుడిని కొలిచేవాళ్లైనా, అనారోగ్యం బారిన పడితే ముందుగా వైద్యులనే ఆశ్రయిస్తూ ఉంటారు. అలాంటి సందర్భాలు నాకు ఎదురైనప్పుడు... నేను కూడా వైద్యురాలిగా ఎదగాలనే కోరిక నాలో నాటుకుపోయింది. నా ఆలోచనను గ్రహించిన కొందరు “కుదురుగా నిలబడలేవు. నువ్వు వైద్యం ఎలా చేయగలుగుతావు?” అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. దాంతో పట్టుదలగా చదివేదాన్ని. క్యాలిపర్స్‌తో సమర్థంగా నడవడం సాధన చేసేదాన్ని. ఇంటర్ ఒంగోలులో పూర్తి చేసిన తర్వాత, ఎంసెట్‌లో 320 ర్యాంకు సాధించాను. 'దివ్యాంగుల కోటాలో సీటు సాధిస్తే, వైకల్యం కారణంగా మెడిసిన్ ప్రవేశానికి అనుమతించరేమో?' అనే ఆలోచన కూడా వేధిస్తూ ఉండేది. దాంతో మెరిట్‌లో సీటు సాధించాలని పట్టుదలతో చదివాను. అనుకున్నది సాధించాను. అలా తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎమ్‌బిబిఎస్ పూర్తి చేశాను. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండి చేశాను.

**మేమిద్దరం ప్రాణ స్నేహితులం**

నాకు పెళ్లి ఆలోచన ఉండేది కాదు. ఒక కోచింగ్ సెంటర్‌లో, జినేంద్ర సత్యశ్రీనివాస్ పరిచయం అయ్యారు. తక్కువ కాలంలోనే మేమిద్దరం మంచి స్నేహితులమైపోయాం. కలకాలం స్నేహితులుగా ఉండాలంటే పెళ్లొక్కటే మార్గమని నిర్ణయించుకున్నాం. అలా 2013లో మేము దంపతులమయ్యాం! ఇప్పటికీ ఆయనే నా బెస్ట్ ఫ్రెండ్. ప్రతి విషయంలో ఆయన తోడ్పాటు ఉంటూనే ఉంటుంది. ప్రస్తుతం ఆయన 'ఈజీలైఫ్ మొబిలిటీ ఇన్నొవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు సిఇఒగా వ్యవహరిస్తున్నారు.



# ప్రతి రోజు యోగా ఆరోగ్యానికి చిరునవ్వు



ప్రతి రోజూ తెల్లవారుఝామున లేచి కొంతసేపు యోగా చేయడం వల్ల శరీరానికి ఎంతో లాభం ఉంటుంది. ఉదయం శాంతమైన వాతావరణంలో తక్కువకాలం అయినా యోగా చేయడం శరీరాన్ని సన్నగా ఉంచడమే కాకుండా మానసిక ప్రశాంతతను కలుగజేస్తుంది. ముఖ్యంగా ప్రాణాయామం వంటి శ్వాస పద్ధతులు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. అనులోమ విలోమ, కపాలభాతి, భస్త్రిక వంటి ప్రాణాయామాలు రోజూ చేయడం వల్ల ఊపిరితిత్తుల పనితీరు మెరుగవుతుంది.తాడాసనం, భుజంగాసనం, వజ్రాసనం లాంటి సాధారణ యోగా ముద్రలు శరీర దృఢత్వాన్ని పెంచుతాయి. వజ్రాసనంలో భోజనం తరువాత కొంతసేపు కూర్చోవడం జీర్ణక్రియకు మంచి. శవాసనంలో కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకోవడం ద్వారా శరీరానికి పూర్తి రిలీఫ్ లభిస్తుంది.యోగా చేయడానికి ముందు కనీసం రెండు గంటల పాటు ఖాళీ కడుపు ఉండాలి. యోగా చేసిన వెంటనే తినకూడదుబీ కొద్దిగా విశ్రాంతి తీసుకుని తినడం మంచిది. నీరు మధ్యలో తక్కువగా తాగాలి, యోగా పూర్తయిన తర్వాత మాత్రమే తాగడం ఉత్తమం.యోగా తరువాత కొంతసేపు ధ్యానం చేయడం వల్ల మానసిక స్థితి స్థిరపడుతుంది. ఇది మనలో శాంతిని కలిగించి దినచర్యను ఉత్తమంగా ప్రారంభించేందుకు సహాయపడుతుంది. ప్రతి ఒక్కరు తమ వయసు, శరీర పరిస్థితి బట్టి సరిపడే ఆసనాలు ఎంపిక చేసుకోవాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు యోగా ప్రారంభించే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.ఈ చిన్నచిన్న అలవాట్లు మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో పెద్దపాలు పంచుకుంటాయి. యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, జీవన శైలిలో భాగంగా మలచుకోవాల్సిన ఒక శ్రేయస్సు మార్గం.

యోగా చేయడం ద్వారా శరీరానికి మనస్సుకు సమానంగా ఆరోగ్యం చేకూరుతుంది. ప్రతిరోజూ కొన్ని నిమిషాలు మాత్రమే కేటాయించినా సరిపోతుంది. ఉదయాన్నే లేచి ప్రకృతి వెలుతురులో, స్వచ్ఛమైన గాలిలో యోగా చేయడం వల్ల మంచి శక్తి కలుగుతుంది. మెల్లగా ఊపిరి తీసుకుంటూ శరీరాన్ని సున్నితంగా చలించిస్తూ ఆసనాలు చేయాలి. తొందరగా చేయడం వల్ల శరీరానికి ఒత్తిడి పడవచ్చు.

ప్రతి ఆసనం చేసిన తర్వాత కొన్ని సెకన్లు ఆగి శరీరాన్ని రిలాక్స్ చేయాలి. ఇది శరీరానికి విశ్రాంతిని ఇస్తుంది. రోజూ ఒకే ఆసనాలను కాకుండా, రోజుకో రెండు కొత్త ఆసనాలు నేర్చుకోవడం వల్ల శరీరమంతటా సంతులనం ఏర్పడుతుంది. యోగా శరీరాన్ని ఫిట్‌గా ఉంచడమే కాకుండా, మానసిక స్థిరతనూ అందిస్తుంది.శ్వాస పద్ధతులు ఎంతో ముఖ్యమైనవి. గమనంగా, జాగ్రత్తగా ఊపిరి తీసుకోవడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ముఖ్యంగా పని ఒత్తిడిలో ఉన్నవారు రోజూ 5 నిమిషాలు కళ్ళు మూసుకుని శ్వాసపై దృష్టి పెట్టడం వల్ల మానసిక స్పష్టత పెరుగుతుంది. ఇది పని సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.ఒకసారి యోగా ప్రారంభించిన తరువాత, ఆ అలవాటు రోజువారీ జీవితంలో భాగమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది, నిద్ర బాగా పడుతుంది, శరీరంలోని నలతలు తగ్గిపోతాయి. అలసటగా ఉంటే కూడా యోగా చేసిన తరువాత శరీరానికి తాజాదనం కలుగుతుంది. ఇది ఒక ప్రకృతి దత్తమైన వైద్య విధానం అని చెప్పొచ్చు.

పిల్లలు, యువత, వృద్ధులు అందరూ తమ శక్తికి తగ్గట్లు యోగా చేయవచ్చు. శరీరాన్ని వినయం గా వినిపించుకుంటూ మెల్లగా చేయడం చాలా ముఖ్యం. మొదట్లో కొంత కష్టంగా అనిపించినా, కొన్ని రోజుల్లోనే శరీరం సరిపోతుంది. యోగా అనేది ఆరోగ్యంగా ఉండాలనుకునే ప్రతిఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలి.

## చేప కుర్మా



**కావల్సినవి:** బొచ్చె చేప ముక్కలు – ఐదు, అల్లం వెల్లుల్లి ముద్ద– రెండు చెంచాలు, ఉల్లిపాయ, టమాటా ముక్కలు – పావుకప్పు చొప్పున, పచ్చిమిర్చి – ఐదు, కరివేపాకు రెబ్బలు – కొన్ని, పసుపు – చెంచా, ఉప్పు – రుచికి తగినంత, ధనియాలపొడి, జీలకర్రపొడి – చెంచా చొప్పున, మెంతి పొడి – అరచెంచా, కారం – నాలుగు చెంచాలు, గరంమసాలా పొడి – చెంచా, చింతపండు – నిమ్మకాయంత, కొత్తిమీర తరుగు – కొద్దిగా, నూనె – పావుకప్పు.

**తయారీ:**

చేపముక్కలకు ఉప్పు, పసుపు, కారం, అరచెంచా వెల్లుల్లి ముద్ద పట్టించి అరగంట నాననివ్వాలి. ఇప్పుడు బాణలిలో కొద్దిగా నూనె వేడిచేసి చేపముక్కల్ని వేయించాలి. మరో బాణలిలో మిగిలిన నూనె వేడి చేసి ఉల్లిపాయముక్కలు వేయించి మిగిలిన అల్లంవెల్లుల్లి ముద్ద, మరికాస్త ఉప్పు, కారం, ధనియాలపొడి, జీలకర్ర చేర్చాలి. ఆ తరవాత సన్నగా తరిగిన టమాటాముక్కలు వేసి మెత్తగా అయ్యేదాకా వేయించాలి. ఆ తరవాత రెండు కప్పుల నీళ్లు పోసి అవి మరుగుతుండగా కరివేపాకు, గాటుపెట్టిన పచ్చిమిర్చి వేయాలి. అందులో చింతపండు రసం వేయాలి. ఈ గ్రేవీ మరుగుతున్నప్పుడు వేయించిపెట్టుకున్న చేపముక్కల్ని వేసి కొద్దిగా మెంతిపొడి చల్లాలి. ముక్కలు ఉడికి దగ్గరయ్యాక మసాలాపొడి, కొత్తిమీర చల్లి దింపేస్తే సరిపోతుంది. వేడివేడి చేపల కుర్మా సిద్ధం.

## చికెన్ రైస్



**కావల్సినవి:** అన్నం – ఒకటిన్నర కప్పు, ఉడికించిన చికెన్ – ముప్పావుకప్పు, ఉల్లిపాయ – ఒకటి, వెల్లుల్లి – రెండు రెబ్బలు (దంచుకోవాలి), పొడుగ్గా తరిగిన క్యారెట్ – అరకప్పు, ఉడికించిన పచ్చిబఠాణీ – పావుకప్పు (అవి లేకపోతే ఎండుబఠాణీని నానబెట్టి ఉడికించుకోవాలి), వెన్న – టేబుల్‌స్పూను, కొత్తిమీర తరుగు – రెండు టేబుల్‌స్పూన్లు, నూనె – టేబుల్‌స్పూను, ఉప్పు – తగినంత, మిరియాలపొడి – చెంచా.

తయారీ: బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలూ, దంచిన వెల్లుల్లి వేయాలి. ఉల్లిపాయ ముక్కలు కాస్త వేగాయనుకున్నాక క్యారెట్ తరుగూ, ఉడికించిన పచ్చిబఠాణీ వేసి వేయించాలి. క్యారెట్ పచ్చివాసన పోయాక చికెన్ ముక్కలూ తగినంత ఉప్పూ, మిరియాలపొడి వేసి బాగా కలపాలి. ఇది కూరలా తయారయ్యాక అన్నం, వెన్నా, కొత్తిమీర తరుగూ వేసి బాగా కలిపి ఐదు నిమిషాలయ్యాక దింపేయాలి.

# కీటో డైట్ పాటిస్తున్నారా..? ఈ ఆహారాలను తినండి..!



నేటి తరుణంలో బరువు తగ్గాలనుకునే చాలా మంది కీటో డైట్ పాటిస్తున్నారు. అంతేకాదు, డయాబెటిస్, థైరాయిడ్, పీసీవోడీ సమస్యలు తదితర అనేక అనారోగ్య సమస్యలకు కీటో డైట్ ఉపయోగంగా ఉంటుందని తెలియడంతో అనేక మంది ఈ డైట్‌ను ఫాలో అవుతున్నారు. అయితే కీటో డైట్‌లో కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారాలను చాలా తక్కువగా, ఫ్యాట్లు, ప్రోటీన్లు ఉన్న ఆహారాలను ఎక్కువగా తినాలి. ఈ క్రమంలోనే కింద సూచించిన ఆహారాలను కీటో డైట్‌లో భాగం చేసుకుంటే మరింత మెరుగైన ఫలితాలను పొందవచ్చు. 1. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల కీటోడైట్‌లో ఉన్న వారు చేపలను ఎక్కువగా తినాలి. నిత్యం కనీసం 85 గ్రాముల చేపలను తింటే ఫలితం ఉంటుంది. చేపల ద్వారా మనకు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు కూడా లభిస్తాయి.

2. క్యాప్సికం, పుట్టగొడుగులు, కాలిఫ్లవర్, క్యాబేజీ, బ్రొకొలి, పాలకూర వంటి కూరగాయలను కూడా కీటో డైట్‌లో ఉన్నవారు తినవచ్చు. వీటిలో మన శరీరానికి కావల్సిన పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ సి, కె వంటి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి.

3. కీటో డైట్‌లో ఉన్నవారు రెగ్యులర్‌గా చికెన్ తినాలి. దీని వల్ల ప్రోటీన్లు, ఫ్యాట్లు మనకు సమృద్ధిగా లభిస్తాయి.

4. కీటోడైట్ పాటించే వారు అవకాడోలను కూడా నిరభ్యంతరంగా తినవచ్చు. వీటిల్లో కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఫ్యాట్లు, పొటాషియం, మినరల్స్ మనకు లభిస్తాయి.

5. కోడిగుడ్లను అత్యుత్తమ కీటోజెనిక్ డైట్‌గా చెప్పవచ్చు. వీటిల్లో కార్బొహైడ్రేట్లు తక్కువగా, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మెటబాలిజాన్ని పెంచుతాయి. మెదడు యాక్టివ్‌గా ఉండేలా చూస్తాయి.


6. ఆలివ్ ఆయిల్, రాస్ప్ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, బ్లాక్‌బెర్రీలు తదితర ఆహారాలను కూడా కీటోడైట్‌లో ఉన్నవారు తీసుకోవచ్చు. అయితే ప్రాసెస్ చేయబడిన మాంసాహారం, చీజ్, పెరుగు, తీపిగా ఉండే పండ్లు, డ్రై ఫ్రూట్స్, బ్రెడ్, అన్నం తదితర కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను మాత్రం కీటోడైట్‌లో ఉన్నవారు మానేయాలి.

# నష్టాలతో ప్రారంభం.. ఈరోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



**ముంబై-నవభూమి:** వరుసగా మూడ్రోజులు లాభాలు ఆర్జించిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్ని నష్టాలతో ప్రారంభించాయి. దేశీయ సూచీలు తొమ్మిది నెలల గరిష్టానికి చేరడంతో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. మొదట ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ఆ తర్వాత నష్టాల బాట పట్టాయి. ఆసియా-పసిఫిక్ ప్రధాన మార్కెట్లు అన్నీ సానుకూలంగానే కదలాడుతున్నాయి. దేశీయ సూచీల నష్టాలకు లాభాల స్వీకరణ మాత్రమే కారణంగా కనిపిస్తోంది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. గత శుక్రవారం ముగింపు (84, 058)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత వెంటనే నష్టాల్లోకి కూరుకుపోయింది. టెక్, టెలికామ్ రంగాలు ప్రధానంగా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 221 పాయింట్ల నష్టంతో 83, 837 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 58 పాయింట్ల లాభంతో 25, 578 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా, హిందుస్థాన్ కాపర్, కెనరా బ్యాంక్, అరబిందో ఫార్మా, ఫెడరల్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. మహానగర్ గ్యాస్, హీరో మోటోకార్ప్, రెడ్డీస్ ల్యాబ్స్, పేజ్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ కార్డు షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 104 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 20 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.47గా ఉంది.

## గుడ్ న్యూస్.. రూ.98 వేల దిగువకు బంగారం.. ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** కొంత కాలంగా ఆల్‌టైమ్ గరిష్టంలో ట్రేడ్ అయిన బంగారం వెండి ధరలు మళ్లీ దిగి వస్తున్నాయి. 10 గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయల కిందకు దిగివచ్చింది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 30న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 97,410కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 89, 290కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 97, 560కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 89, 440కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 97, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 89, 290కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ. 100 మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 97, 410, రూ. 89, 290
విజయవాడలో రూ. 97, 410, రూ. 89, 290
ఢిల్లీలో రూ. 97, 560, రూ. 89, 4400
ముంబైలో రూ. 97, 410, రూ. 89, 290
వడోదరలో రూ. 97, 460, రూ. 89, 340
కోల్‌కతాలో రూ. 97, 410, రూ. 89, 290
చెన్నైలో రూ. 97, 410, రూ. 89, 290
బెంగళూరులో రూ. 97, 410, రూ. 89, 290
కేరళలో రూ. 97, 410, రూ. 89, 290
పుణెలో రూ. 97, 410, రూ. 89, 290

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 1, 17, 700
విజయవాడలో రూ. 1, 17, 700
ఢిల్లీలో రూ. 1, 07, 700
చెన్నైలో రూ. 1, 17, 700
కోల్‌కతాలో రూ. 1, 07, 700
కేరళలో రూ. 1, 17, 700
ముంబైలో రూ. 1, 07, 700
బెంగళూరులో రూ. 1, 07, 700
వడోదరలో రూ. 1, 17, 700
అహ్మదాబాద్‌లో రూ. 1, 17, 700

## టొరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమికల్స్


**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ఫార్మా రంగంలో మరో భారీ డీల్ చోటు చేసుకుంది. జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్‌ను టొరెంట్ ఫార్మా రూ.19,500 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం జేబీ కెమికల్స్ ఈక్విటీలో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ కేకేఆర్ అనుబంధ సంస్థ.. టావ్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ పీటీఈ లిమిటెడ్‌కు ఉన్న 46.39 శాతం వాటాను రూ.11,917 కోట్లకు, జేబీ కెమికల్స్ ఉద్యోగుల వద్ద ఉన్న 2.8 శాతం వాటాను రూ.719 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరినట్టు టొరెంట్ ఫార్మా ఆదివారం ప్రకటించింది. ఇందుకోసం టొరెంట్ ఫార్మా జేబీ కెమికల్స్ ఒక్కో షేరుకు రూ.1,600 చొప్పున చెల్లించనుంది. ప్రజల వద్ద ఉన్న మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.1,639.18 చొప్పున రూ.1,799.35 కోట్లకు కొనేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలుతో ఫార్మా రంగంలో తమ స్థానం మరింత పటిష్ఠం కావడంతో పాటు కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని టొరెంట్ ఫార్మా తెలిపింది.

## వస్తున్నాయ్ జొమాటో విమానాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో సహ వ్యవస్థాపకుడు దీపీందర్ గోయెల్.. ల్యాట్ ఏరోస్పేస్ భాగస్వామ్యంలో ప్రాంతీయ విమానయానంలో ప్రవేశించే యోచన చేస్తున్నారు. జొమాటో సహ వ్యవస్థాపకురాలు సురభి దాస్ లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో ఈ విషయం వెల్లడించారు. దేశంలోని 450 ఎయిర్‌స్ట్రిపలలో 150 మాత్రమే పని చేస్తున్నాయి. అంటే మూడింట రెండు వంతులు ఇప్పటికీ వృధాగానే పడి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవడం వల్ల ఇప్పటికీ రోడ్డు లేదా రైలు మార్గాల్లో ప్రయాణిస్తూ గంటలు, రోజులు వృధా చేసుకుంటున్న సగటు జీవులకు తక్కువ వ్యయంతో విమానాల్లో తిరిగే అవకాశం కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. తాము ప్రారంభించాలనుకుంటున్న ల్యాట్ ఏరోస్పేస్ విమానాలు ఒక పార్కింగ్ లాట్‌తో సమానమైన విస్తీర్ణం ఉండే ఎయిర్-స్ట్రిపలలో టేకాఫ్, ల్యాండింగ్ కాగలవని ఆమె చెప్పారు.

## భారతదేశంలో కృత్రిమ మేథస్సు (ఏఐ).. ఉర్సా క్లస్టర్స్‌కు ప్రపంచ స్థాయి నాయకత్వం






**హైదరాబాద్-నవభూమి:** భారతదేశపు మొట్టమొదటి సమగ్ర కృత్రిమ మేథస్సు మౌలిక సదుపాయాల వేదిక అభివృద్ధి సంస్థ అయిన ఉర్సా క్లస్టర్స్, తన తదుపరి దశ వృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సాంకేతిక నాయకుల నియామకాన్ని నేడు ప్రకటించింది. కంపెనీ పలు రాష్ట్రాలలో కృత్రిమ మేథస్సు-ఆప్టిమైజ్ చేయబడిన డేటా కేంద్రాల నెట్‌వర్క్‌ను నిర్మిస్తుండడంతో, కొత్త నాయకత్వం భారతదేశ కృత్రిమ మేథస్సు పరివర్తనను వేగవంతం చేసేందుకు ప్రపంచ అనుభవాన్ని, లోతైన రంగ నైపుణ్యాన్ని తీసుకువస్తుంది. కొత్త నియామకాలలో ఎరిక్ వార్నర్ ఉండగా, ఆయన ప్రధాన ఆదాయ అధికారి (సీఆర్వో)గా చేరారు. సన్ మైక్రోసిస్టమ్స్, బీఈఏ సిస్టమ్స్ ఆర్ఎస్ఏ సెక్యూరిటీలలో నాలుగు దశాబ్దాలకు పైగా ఎంటర్‌ప్రైజ్ సాంకేతికతలో నాయకత్వాన్ని తీసుకువచ్చారు. అధిక-పనితీరు గల మౌలిక సదుపాయాల కోసం డిమాండ్ పెరుగుతూనే ఉండడంతో, వార్నర్ హైపర్‌స్కేల్ మేఘ ప్రదాతలు కృత్రిమ మేథస్సు-ఆధారిత సంస్థలతో ఉర్సా క్లస్టర్స్ వాణిజ్య భాగస్వామ్యాలకు నాయకత్వం వహించనున్నారు. తన నియామకం గురించి ఎరిక్ వార్నర్ మాట్లాడుతూ, "భారతదేశం కృత్రిమ మేథస్సు మౌలిక సదుపాయాలకు తదుపరి సరిహద్దును సూచిస్తుంది. ఇక్కడ డిమాండ్ సరఫరా కన్నా చాలా ఎక్కువగా పెరుగుతోంది. భూమి, విద్యుత్, అనుమతుల విషయంలో ఉర్సా క్లస్టర్స్ ముందస్తు అమలు ఈ డిజిటల్ పరివర్తన తరంగానికి నాయకత్వం వహించడానికి ప్రత్యేకంగా స్థానం కల్పిస్తుంది" అని వివరించారు. ప్రపంచ మార్కెట్లలో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపియు)-ఆప్టిమైజ్ చేసిన కృత్రిమ మేథస్సు మౌలిక సదుపాయాలను అమలు చేయడంలో లోతైన నైపుణ్యం కలిగిన ఎన్విడియా డేటా సెంటర్‌ల మాజీ అనుభవజ్ఞులైన ఉడు టెక్నాలజీస్ నుంచి అలెక్స్ సాడో కీత్ డైన్స్ చేరికతో కంపెనీ మరింత బలోపేతం చేయబడింది. అలెక్స్ గతంలో ఎన్విడియాలో మేఘ కృత్రిమ మేథస్సు, అధిక పనితీరు గల కంప్యూటింగ్ వ్యూహానికి నాయకత్వం వహించారు. కంపెనీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార ఛానెల్‌ను నడిపించి, అమెరికా, చైనా వ్యాప్తంగా ప్రధాన మేఘ వేదికలలో జీపియు లాంచ్‌లను నిర్వహించారు. కీత్ 30 ఏళ్లకు పైగా డేటా సెంటర్ అనుభవాన్ని తీసుకురావడంతో పాటు, ప్రైవేట్ మేఘ వేదికలు పరిశోధన - అభివృద్ధి పరీక్షా ప్రయోగశాలల కోసం స్థల ఎంపిక, లీజింగ్ నిర్మాణ నిర్వహణలో ఎన్విడియా ప్రయత్నాలకు నాయకత్వం వహించారు. బైన్ -% కంపెనీలో అలెక్స్ వ్యూహాత్మక సలహాదారు అనుభవంతో పాటు, వారి మిశ్రమ నేపథ్యాలు వ్యాపార వ్యూహం సాంకేతిక అమలులో ప్రత్యేకమైన నైపుణ్యాన్ని అందిస్తాయి. సంస్థ ఎంటర్‌ప్రైజ్ పరిశోధన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కృత్రిమ మేథస్సు పనితీరు కోసం ఎన్విడియా డీజీఎక్స్ ప్రమాణాలకు అనుగుణంగా సదుపాయాలను అందించేందుకు ఉర్సా క్లస్టర్స్ కృషి చేస్తోంది. ఈ కొత్త అధ్యాయంపై అలెక్స్ సాడో మాట్లాడుతూ:"శక్తివంతమైన డేటా కేంద్రాల అభివృద్ధి ద్వారా భారతదేశ కృత్రిమ మేథస్సు దృశ్యాన్ని మార్చడానికి సిద్ధంగా ఉన్న ఒక వృద్ధి చెందుతున్న నాయకుడు ఉర్సా క్లౌడ్ మౌలిక సదుపాయాల విభాగంతో భాగస్వామ్యం చేయడం మా బృందానికి గర్వకారణం. మేం తీసుకొస్తున్న దశాబ్దాల అనుభవం భారతదేశం యొక్క దార్శనిక కృత్రిమ మేథస్సు దిశను బలోపేతం చేస్తుంది. ఇది ఆవిష్కరణలను వేగవంతం చేస్తూ, పరిశోధకులను శక్తివంతం చేస్తుంది. గ్లోబల్ సౌత్ వ్యాప్తంగా బలమైన భాగస్వామ్యాల ద్వారా దేశాన్ని ప్రపంచ కృత్రిమ మేథస్సు శక్తిగా స్థాపించడమే లక్ష్యం" అని వివరించారు. ఉర్సా క్లస్టర్స్ సహ వ్యవస్థాపకుడు సతీష్ అబ్బూరి మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి నాయకత్వం చేరిక భారతదేశంలో

## ముగ్గురు ఓపెన్‌ఏఐ నిపుణులను నియమించుకున్న మెటా కంపెనీ..




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం భారీగా పెరిగింది. ఈ క్రమంలో టెక్ కంపెనీల మధ్య పోటీ తీవ్రతరమైంది. తాజాగా, సామ్ ఆల్ట్‌మన్ చేసిన మెటా కంపెనీపై సంచలన ఆరోపణలు చేశారు. సామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ.. మెటా కంపెనీ ఉద్యోగులను ఆకర్షించేందుకు భారీ ప్యాకేజీలు ఆఫర్ చేస్తోందన్నారు. మెటా కంపెనీ కొందరు ఉద్యోగులకు మిలియన్ డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో రూ.833 కోట్ల వరకు ఆఫర్ చేస్తుందని పేర్కొన్నారు. ఓపెన్ ఏఐ తమకు ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నందున వల్లే మెటా ఈ రీతిలో దూకుడుగా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు.

వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక సైతం ఈ ఆరోపణలకు బలాన్ని ఇచ్చింది. నివేదిక ప్రకారం.. మెటా కంపెనీ ఓపెన్ ఏఐ జ్యూరిచ్ కార్యాలయంలో పని చేసిన ముగ్గురు ప్రముఖ ఏఐ పరిశోధకులు అలెగ్జాండర్ కోలెస్నికోవ్, లూకాస్ బేయర్, జియాహువా జై లను తీసుకుందని.. వీరు ఓపెన్ ఏఐలో అనుభవజ్ఞులని.. సాంకేతిక నిపుణులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. కృత్రిమ మేథాలో వెనుకపడిపోతామన్న భయంతో మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ సూపర్ ఇంటెలిజెన్స్ టీమ్‌ను నిర్మించేందుకు ప్రతిభావంతులను తీసుకోవాలని నిర్ణయించారు. గత కొన్ని సంవత్సరాల్లో మెటా నుంచి అనేక మంది ఏఐ నిపుణులు బయటకు వెళ్లిపోయారు. దాంతో కంపెనీకి చెందిన ఏఐ ప్రాజెక్టుల వేగం మందగించింది. ఈ పరిస్థితిలో మార్పులు తీసుకువచ్చేందుకు రిక్రూట్‌మెంట్‌పై జుకర్ బర్గ్ దృష్టి సారించారు. ఓపెన్ ఏఐ, గూగుల్ వంటి కంపెనీలు ఏఐలో ముందు వరుసలో ఉండగా.. మెటా సైతం తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది.


## ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల దినోత్సవ ప్రత్యేకత




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆన్‌లైన్ ఆవిష్కరణ, ఆఫ్‌లైన్ కొనుగోళ్ల వరకు విస్తరించిన ఆధునిక వినియోగదారుని ప్రయాణాలను పరిష్కరించేందుకు 67% స్టార్టప్‌లు ఓమ్నిఛానల్ నమూనాలను స్వీకరించాయి. అధిక డిమాండ్, ఇప్పటికే ఉన్న సరఫరా అంతరాలను తీర్చేందుకు దాదాపు అన్ని స్టార్టప్‌లు చిన్న నగరాలు, పట్టణాల (టైర్ 2/3) మార్కెట్లలోకి విస్తరిస్తున్నాయి. 52% స్టార్టప్‌లు సరిహద్దును విస్తరిస్తుండగా, భారీ మార్కెట్లు, భారతీయ-మూల ఉత్పత్తులకు ప్రపంచ డిమాండ్‌ను పొందుతున్నాయి .భారతదేశం స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ దాని తదుపరి వృద్ధి దశలోకి వేగవంతం కావడంతో, అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలు ఓమ్నిఛానల్ వ్యూహాలు, క్రియేటర్ల టైర్-2 టైర్-3 మార్కెట్‌లకు, సమానంగా క్రాస్-బోర్డర్ భౌగోళిక ప్రాంతాలకు యాక్సెస్‌తో డిజిటల్ ఆవిష్కరణ ద్వారా తమ వృద్ధిని పునర్నిర్మించుకుంటున్నాయి. ప్రపంచ %MSME% దినోత్సవం సందర్భంగా, ప్రముఖ గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ అల్వారెజ్ మార్సల్ ఇండియా (%ఏఅండ్‌ఎమ్% ఇండియా) సహకారంతో మెటా ఒక కొత్త నివేదికను విడుదల చేసింది. ఇది 100 అధిక-వృద్ధి చెందుతున్న భారతీయ స్టార్టప్‌లతో లోతైన చర్చల ఆధారంగా ఇన్‌సైట్లను సేకరించి, భారతదేశ స్టార్టప్‌లకు వృద్ధికి ఆరు కీలక లివర్‌లను వివరించింది: స్వీకరణ, సరిహద్దు విస్తరణ, ఓమ్నిఛానల్ ఉనికి, టైర్ 2/3 మార్కెట్ విస్తరణ, కేటగిరీ డైవర్సిఫికేషన్, సృష్టికర్త నేతృత్వంలోని బ్రాండ్ బిల్డింగ్. అధిక-వృద్ధి చెందుతున్న వ్యాపారాలు పెట్టుబడిదారులకు సలహా ఇవ్వడంలో అల్వారెజ్ మార్సల్ నైపుణ్యం దాని డేటా-ఆధారిత, వాస్తవ-ప్రపంచ విధానంతో కలిపి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అమలు చేయగల ఫలితాలను నివేదికలో పొందుపరిచింది.


భారతదేశ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ గత దశాబ్దంలో మెట్రోలు, నాన్-మెట్రో ప్రాంతాలలో ప్రారంభ-దశ నిధులు, డిజిటల్ వ్యాప్తి వినియోగదారుల సంపదలో పెరుగుదలతో ఘాతాంక వృద్ధిని సాధించింది. ఇది AIవంటి సాంకేతికతలు దేశంలో స్టార్టప్‌లు MSM%ల వృద్ధికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. "నేటి డైనమిక్ యుగంలో, స్మార్ట్‌గా ఆలోచించి, వేగంగా అభివృద్ధి చెందే స్టార్టప్‌లు ఈ రంగంలో ముందంజలో ఉంటాయి. మెటాలో, ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉన్నందుకు మేము గర్విస్తున్నాము. వారి ధైర్యమైన ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు, ప్రభావంగా మార్చడానికి సహాయపడే అత్యాధునిక AI-ఆధారిత సాధనాలతో వారిని సన్నద్ధం చేస్తున్నాము" అని మెటా ఇండియా ఆగ్నేయాసియా ఉపాధ్యక్షురాలు సంధ్యా దేవనాథన్ అన్నారు. అల్వారెజ్ -మార్సల్ ఇండియా జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ హెడ్ హిమాన్షు బజాజ్ మాట్లాడుతూ, "భారతీయ స్టార్టప్‌లు కేవలం వృద్ధిని సాధించడం కోసం మాత్రమే కాకుండా విలువ సృష్టిపై దృష్టి సారించే మరింత స్థిరమైన వ్యాపారాలను నిర్మించడాన్ని పెంచుకోవడం గురించి ఆలోచించే విధానంలో గణనీయమైన మార్పును మేము చూస్తున్నాము. ఇవి AI-చిన్ననగరాలు, పట్టణాలకు విస్తరణ, ఓమ్నిఛానల్ నమూనాలు ఇకపై భవిష్యత్ పందెం కావు- అవి నేడు అమలుకు పునాదిగా ఉన్నాయి. ప్రారంభ దశ స్టార్టప్‌లు ఈ లివర్‌లను ఆశ్చర్యకరమైన అధునాతనతతో ఎలా వర్తింపజేస్తున్నాయో అనేది ప్రత్యేకంగా కనిపిస్తుంది. అల్వారెజ్ మార్సల్‌లో, మేము ఈ వెంచర్‌లలో చాలా వాటితో భాగస్వామ్యం కలిగి ఉన్నాము- అది వ్యాపార నమూనా వ్యూహం, వ్యయ సామర్థ్యం, సప్లయ్ చెయిన్ లేదా ఆర్గ డిజైన్ అయినా- మెటాతో ఈ నివేదిక భారతదేశ స్టార్టప్ ఆర్థిక వ్యవస్థ తదుపరి దశను రూపొందించే ఉద్భవిస్తున్న బ్లూప్రింట్‌ను సంగ్రహిస్తుంది" అని వివరించారు. మార్కెటర్లకు AI- గేమ్-ఛేంజర్‌గా మారడంతో, 70% కన్నా ఎక్కువ స్టార్టప్‌లు దీనిని తమ వ్యాపార కార్యకలాపాలలో అనుసంధానిస్తున్నాయని నివేదిక వివరిస్తుంది. మార్కెటింగ్‌లో మాత్రమే, 87% AI-అడాప్టర్లు కొనుగోలు ఖర్చు లో ది30% వృద్ధి చెందిందని పేర్కొన్నారు. హెల్త్‌కేర్, ఎడ్‌టెక్ బ్యూటీ వంటి రంగాలు కస్టమర్ సర్వీస్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వ్యక్తిగతీకరణ కోసం ఆటోమేషన్‌ను ఉపయోగించుకుంటూ AI పరిపక్వతలో ముందంజలో ఉన్నాయి.

# నయారా ఎనర్జీకి రాస్‌నెఫ్ట్ గుడ్‌బై




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ పెట్రోలియం రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని వడినార్ వద్ద రెండు కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన నయారా ఎనర్జీ రిఫైనరీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో ఈ కంపెనీకి 49.13 శాతం వాటా ఉంది. ఈ వాటాను విక్రయించేందుకు రాస్‌నెఫ్ట్ అధికారులు గత ఏడాది కాలంలో మూడు సార్లు ముంబై, ఢిల్లీ వచ్చి వివిధ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో కూడా ప్రస్తుతం ఇందుకోసం ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై రెండు కంపెనీలు అధికారికంగా నోరు మెదపడం లేదు. రాస్‌నెఫ్ట్‌తో పాటు ఈ రిఫైనరీలో 24.5 శాతం వాటా కలిగిన మరో రష్యా కంపెనీ యూసీపీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ కూడా తన వాటా అమ్మకానికి పెట్టినట్టు తెలుస్తోంది. 2017లో ఎస్సార్ నుంచి కొనుగోలు: ఎస్సార్ ఆయిల్‌గా ఉన్న ఈ రిఫైనరీ ప్రాజెక్ట్ ఈక్విటీలో మెజారిటీ వాటాను రష్యా కంపెనీలు 2017లో 1,290 కోట్ల డాలర్లకు కొనుగోలు చేశాయి. అమెరికా, ఈయూ ఆంక్షలతో ఈ రిఫైనరీ ప్రాజెక్టు లాభాలను తమ దేశానికి తరలించడం రష్యా కంపెనీలకు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. దీంతో నయారా ఎనర్జీ కంపెనీ నుంచి తప్పుకోవడమే మేలనే నిర్ణయానికి వచ్చాయి. ఇందుకోసం ఆర్ఐఎల్‌తో సహా సౌదీ అరామ్కో, అదానీ గ్రూప్, ఓఎన్‌జీసీ/ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లను రష్యా కంపెనీలు సంప్రదించాయి. అయితే ఈక్విటీలో తమ వాటాకు రష్యా కంపెనీలు 2,000 కోట్ల డాలర్లు (సుమారు రూ1.7 లక్షల కోట్లు) అడిగినట్టు సమాచారం. ఇది చాలా ఎక్కువనే అంచనాతో ఈ కంపెనీలు నయారా కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు.

## మారనున్న రూల్స్.. ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆధార్ - పాన్, తత్కాల్ టికెట్స్ బుకింగ్ రూల్స్ మారనున్నాయి. పాన్ కార్డు తీసుకోవడానికి.. తత్కాల్ టికెట్స్ బుక్ చేసుకోవడానికి ఆధార్ తప్పనిసరి కానుంది. జులై 1వ తేదీనుంచి అమలుకానున్న కొత్త రూల్స్ ఏంటి? ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యూపీఐ చార్జ్ బ్యాక్ రూల్స్‌లో మార్పులు తీసుకురానుంది. ఇప్పటి వరకు చార్జ్ బ్యాక్ రిక్వెస్ట్ తిరస్కరణకు గురైతే బ్యాంకు ఎన్‌పీసీఐని సంప్రదించాల్సి వస్తోంది. అయితే, జులై 1వ తేదీ నుంచి ఎన్‌పీసీఐ జోక్యం ఉండదు. ఎన్‌పీసీఐ ఆమోదం లేకుండానే బ్యాంకులు చార్జ్ బ్యాక్‌ను ప్రాసెస్ చేయనున్నాయి.

## వచ్చే వారం ఏకంగా 7 ఐపీఓలు రాబోతున్నాయ్

**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే వారం ఏకంగా ఏడును ఐపీఓలు రాబోతున్నాయి... తోడు లిస్టింగ్‌లోకి వచ్చే కంపెనీలు కూడా




ప్రతి వారం లాగానే ఈ వారం కూడా ఐపీఓల సందడి స్టాక్ మార్కెట్‌లో కనిపించనుంది. అయితే ఈసారి ఏకంగా ఏడు సంస్థలు తమ మొదటిసారి షేర్లను ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో పాటు మరికొన్ని కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అవుతున్నాయి. ఇప్పుడు వాటి వివరాలు చూద్దాం. 2025 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో ఐపీఓల ఉత్సాహం పెరిగింది. ఈ నేపథ్యంలో జూన్ 30తో ప్రారంభమయ్యే వారంలో మొత్తం ఏడుకు పైగా ఐపీఓలు మార్కెట్‌లోకి రానున్నాయి. వాటిలో మూడు ప్రధాన బోర్డు విభాగానికి చెందినవిగా ఉంటే, మొత్తం ఏడు కంపెనీలు తమ షేర్లను మార్కెట్‌లో జాబితా చేయించనున్నాయి.

కొత్తగా రాబోతున్న ఐపీఓలు:

పుష్ప జ్యువెలర్స్ ఐపీఓ: జూన్ 30న ప్రారంభమై జూలై 2న ముగుస్తుంది. కంపెనీ రూ. 98.65 కోట్లు సమీకరించాలనుకుంటోంది. షేర్ కేటాయింపు జూలై 3న జరగనుంది. షేర్లు జూలై 7న ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈలో లిస్టింగ్ అవుతాయి. ధర పరిధి: ఒక్కో షేరుకు రూ. 143%-%147, లాట్ పరిమాణం: 1000 షేర్లు.సిల్కీ ఓవర్సీస్ ఐపీఓ: రూ. 30.68 కోట్ల విలువైన ఈ ఇష్యూ జూన్ 30న ప్రారంభమై జూలై 2న ముగుస్తుంది. ఒక్కో షేరు ధర రూ. 153%-%161, లాట్ పరిమాణం: 800 షేర్లు. జూలై 7న ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈలో లిస్ట్ అవుతాయి.

సెడార్ టెక్స్టైల్స్ ఐపీఓ: రూ. 60.90 కోట్ల ఇష్యూ జూన్ 30న ప్రారంభమవుతుంది. ఒక్కో షేరు ధర రూ. 130%-%140, లాట్ పరిమాణం 1000 షేర్లు. జూలై 7న ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈలో లిస్ట్ అవుతుంది.

మార్క్ లోయిర్ ఐపీఓ: రూ. 21 కోట్ల విలువైన ఈ ఇష్యూ జూన్ 30 నుంచి జూలై 2 వరకు ఉంటుంది. ఒక్కో షేరు ధర రూ. 100, లాట్ పరిమాణం: 1200 షేర్లు. జూలై 7న బీఎస్ఈ ఎస్ఎమ్ఈలో లిస్ట్ అవుతాయి.

వందన్ ఫుడ్స్ ఐపీఓ: రూ. 30.36 కోట్ల ఈ ఇష్యూ జూన్ 30న ప్రారంభమై జూలై 2న ముగుస్తుంది. షేర్ ధర రూ. 115, లాట్ పరిమాణం: 1200 షేర్లు. జూలై 7న బీఎస్ఈ ఎస్ఎమ్ఈలో లిస్టింగ్.

క్రిజాక్ ఐపీఓ: ప్రధాన బోర్డు విభాగంలో రూ. 860 కోట్ల ఇష్యూ జూలై 2న ప్రారంభమవుతుంది. షేర్ ధర: ఒక్కో షేరు రూ. 233%-%245, లాట్ పరిమాణం: 61 షేర్లు. జూలై 9న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ అవుతాయి.

ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ ఐపీఓ: జూలై 3న ప్రారంభమై జూలై 7న ముగుస్తుంది. జూలై 10న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానుంది. షేర్ ధర శ్రేణి ఇంకా తెలియాల్సి ఉంది.

లిస్టింగ్‌కు వచ్చే కంపెనీలు:

జూలై 1న క్రింది కంపెనీల షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవుతాయి:

బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రధాన బోర్డు: కల్పతరు, గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్, ఎల్లెన్‌బరీ ఇండస్ట్రియల్ గ్యాస్.

బీఎస్ఈ ఎస్ఎమ్ఈ: ఏజేసీ జ్యువెల్, అబ్రమ్ ఫుడ్, ఐకాన్ ఫెసిలిటేటర్స్.

ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ: శ్రీ హరే కృష్ణ స్పాంజ్ ఐరన్.

ఈ విధంగా వచ్చే వారం స్టాక్ మార్కెట్‌లో ఐపీఓలు, లిస్టింగ్‌లు హుషారుగా జరగనున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | మంగళవారం | 01 । జులై 2025

## కిరణ్ అబ్బవరం మూవీ ఫస్ట్ లుక్ విడుదల.. ప్రభాస్ సినిమా ఫస్ట్ లుక్‌ని కాపీ కొట్టావా




టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా చిత్రాలు చేస్తున్నారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం %ఖ--ూవీ%. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. యుక్తి తర్జా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేష్ దండ శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు. ఈ రోజు చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కిరణ్ అబ్బవరం మాస్ అవతారంలో మెరిసాడు. చేతులతో లుంగీ పట్టుకుని స్టైల్‌గా ముందుకు నడుస్తున్న విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన వెనుక భాగంలో ఫైర్ ఎఫెక్ట్‌లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ బాగుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే కొన్ని వర్గాలు ఈ పోస్టర్ డిజైన్‌ను ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' మూవీ పోస్టర్‌కు పోలికలు ఉన్నాయని అంటున్నారు. ఈ విషయం పై యూనిట్ ఇంకా స్పందించలేదు. ఇక ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. కిరణ్ అబ్బవరం %-% చేతన్ భరద్వాజ్ కలయికలో ఇది మూడో చిత్రం.



## గోల్డెన్ డ్రెస్సులో అనన్య



తెలుగు చిత్రసీమలో తమదైన ముద్ర వేసుకుంటున్న అనన్య నాగల్లా తాజాగా బంగారు వర్ణపు దుస్తుల్లో మెరిసిపోతూ ఫోటోషూట్ ద్వారా అభిమానులను మైమరిపిస్తున్నారు. సింపుల్ క్యాప్షన్‌తో "చెక్కుబడ్డాను " అని పేర్కొంటూ విడుదల చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో దూసుకెళ్తున్నాయి. ఆమె అందాన్ని మరింత హైలైట్ చేసేలా రూపొందించిన ఈ దుస్తులు, ఆమె సహజ కాంతిని రెట్టింపు చేస్తూ, రాజసంగా ముస్తాబయ్యేలా తీర్చిదిద్దాయి. ఈ లుక్‌ను ఏఇన్ఫినైట్. చరణ్ కెమెరాలో బంధించగా. ఏవిన్ను బేబీ స్టైలింగ్ చేసి, ఏరాణి అరుణ మేకప్ చేశారు. కెమెరా ముందు అనన్యకు ఉన్న స్వచ్ఛమైన ఆకర్షణ, లోతైన అభినయం మరోసారి వెలుగులోకి వచ్చింది. మొదటి చిత్రం 'మల్లేశం' (2019) తోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్న అనన్య, 'ప్లేబ్యాక్', 'పిట్ట కథలు' వంటి చిత్రాల్లో విలక్షణమైన పాత్రలను పోషించారు. తాజాగా 'శాకుంతలం' చిత్రంలో సమంతతో కలిసి కనిపించి, పురాణ నేపథ్య కథల్లోనూ తన ప్రతిభను చాటారు. విభిన్నమైన పాత్రల ఎంపికతో, నటనకు ప్రాముఖ్యతనిస్తూ... నిస్సందేహంగా అనన్య నాగల్లా ఒక నిలకడైన, నైపుణ్యంతో కూడిన నటిగా ఎదుగుతున్నారు. బంగారు దుస్తుల్లో అయినా, భావోద్వేగ పాత్రలో అయినా... ఆమె ప్రతి రూపం, ప్రతి అంగీభావం ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తోంది.

## కన్నప్పకి పైరసీ దెబ్బ.. వేల సంఖ్యల్లో ఆన్ లైన్ లింకులు



మంచు విష్ణు, మోహన్ బాబు, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలలో రూపొందిన కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదలై మంచి విజయం సాధించింది. ఈ పాన్ ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డా. ఎం. మోహన్ బాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మించారు. రిలీజ్ అయినప్పటి నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అయితే, ఈ మూవీ సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న సమయంలో 'కన్నప్ప' చిత్రం పైరసీ బారిన పడింది. ఈ విషయంపై హీరో విష్ణు స్పందిస్తూ, ఇప్పటికే 30 వేలకు పైగా పైరసీ లింక్‌లు తొలగించామన్నారు. అయినప్పటికీ పైరసీ కొనసాగుతుండటం బాధాకరమని తెలిపారు.

"పైరసీలో సినిమా చూడటం అంటే దొంగతనం చేయడమే. మనం మన పిల్లలకు దొంగతనం చేయమని చెప్పము కదా. అలాంటప్పుడు వారిని పైరసీలా సినిమాలు చూడమని ఎలా చెబుతాం?" అని తేలికపాటి ఉదాహరణతో కీలక సందేశం ఇచ్చారు. పైరసీని ప్రోత్సహించకండి. సరైన మార్గంలో సినిమాకు మద్దతు ఇవ్వండి అని విష్ణు విజ్ఞప్తి చేశారు. మేము ఎంతో శ్రమ, పెట్టుబడితో నిరమించే సినిమాలని ఇలా పైరసీ రూపంలో దెబ్బతీయడం కరెక్ట్ కాదు అని విష్ణు పేర్కొన్నారు. సినీ పరిశ్రమకి పైరసీ చాలా ఇబ్బందిగా మారిందని, పైరసీని అరికట్టేందుకు ప్రేక్షకుల సహకారం కూడా తప్పనిసరి అని ఈ సందర్భంగా విష్ణు పేర్కొన్నారు. సినిమాను థియేటర్లలో లేదంటే అధికారిక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో మాత్రమే చూసి, తమ కష్టానికి ప్రతిఫలం అందేలా చూడాలని కోరారు. భారీ ప్రాజెక్ట్ గా రూపొందిన కన్నప్ప చిత్రంపౌరాణిక నేపథ్యంతో తెరకెక్కి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. విష్ణు కన్నప్ప మూవీ కోసం తన ఆస్తుల్ని కూడా తాకట్టు పెట్టారు. తనకి ఈ సినిమా మీదున్న నమ్మకంతో ఇంకా ఎవ్వరికీ ఏ హక్కుల్ని కూడా అమ్మలేదు. సినిమా రిలీజ్ అయిన తరువాత హిట్ టాక్ వస్తుంది.. అప్పుడు తాను చెప్పిన రేటుకే అమ్మేస్తాను అంటూ విష్ణు ఎంతో నమ్మకంగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఓటీటీ డీల్ నడుస్తుంది. మరి ఎవరికి హక్కులు దక్కుతాయో, ఓటీటీ డీల్స్‌లో ఎలాంటి చర్చలు జరుగుతాయో.. పది వారాల కంటే ముందుగానే వస్తుందా లేదా తర్వాత వస్తుందా అనేది చూడాలి.

## తనతో మధ్యాహ్నం కూర్చుంటే లేచే సరికి సాయంత్రం అవుతుంది.. సామ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలకు కాస్త విరామం ఇచ్చినా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటుంది. తరచూ ఫోటోలు, రీల్స్ షేర్ చేస్తూ అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తోంది. నిన్నటికి నిన్న 'పుల్ అప్స్ చేయకపోతే కామెంట్స్ చేయొద్దు' అంటూ ఓ సెటైరికల్ పోస్ట్‌తో ఆకట్టుకున్న సమంత, తాజాగా తన డేలీ లైఫ్‌లోని విశేషాలను పంచుకుంది. మహానటి ఫేం కీర్తి సురేష్‌తో దిగిన ఫోటోను షేర్ చేస్తూ, "లంచ్‌కి మధ్యాహ్నం కూర్చుంటే, లేచేసరికీ సాయంత్రం అయిపోతుంది" అంటూ ఆ పిక్‌కి క్యాప్షన్ పెట్టింది. కీర్తి సురేష్ సమంతకి జిగిరీ దోస్త్ కాగా, వారు అప్పుడప్పుడు కలుస్తూ ఇలా సందడి చేస్తూనే ఉన్నారు.


సమంతకి ఇండస్ట్రీలో చాలా మంది స్నేహితులు ఉన్నా, తరచూ కలుసుకునే సన్నిహితులు మాత్రం కొద్ది మంది మాత్రమే. అందులో కీర్తి సురేష్ ముందు వరుసలో ఉంటారు. వీరి స్నేహం 'మహానటి' సినిమా సమయంలో మొదలైంది. సినిమాలో కీర్తి సురేష్ లెజెండరీ నటి సావిత్రి పాత్ర పోషించగా, సమంత జర్నలిస్ట్ మధురవాణిగా కనిపించి అలరించింది.. ఈ సినిమా తర్వాత మొదలైన పరిచయం, ఇప్పటివరకు స్నేహంగా కొనసాగుతోంది. బీచ్ వాల్క్స్, పబ్ పార్టీలు, వెకేషన్లు%ా% వీరిద్దరూ కలిసి కనిపించడం చాలా కామన్. తాజాగా వీరిద్దరి లంచ్ మీట్ ఫోటో నెట్టింట వైరల్‌గా మారింది. "టూ క్యూటీస్ ఇన్ వన్ ఫ్రేమ్" అంటూ ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరు హీరోయిన్స్ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సమంత ఇంటర్నేషనల్ సిరీస్ రక్త్ బ్రహ్మాండ్ కోసం పని చేస్తోంది. మరోవైపు తన నిర్మాణంలో మంచి సినిమాని తెరకెక్కించేందుకు పలు కథలు వింటుంది. ఇక కీర్తి సురేష్ విషయానికి వస్తే వరుస సినిమాలతో దూసుకుపోతున్నది. ఆమె నటించిన ఉప్పు కప్పురంబు చిత్రం విడుదలకు రెడీ అవుతుండగా, మరో ప్రాజెక్ట్ "రివాల్వర్ రీటా" షూటింగ్ దశలో ఉంది. వీరిద్దరు ఓ పక్క కెరీర్‌లో బిజీగా ఉంటూనే, మరో పక్క స్నేహానికి విలువ ఇస్తూ కలిసి గడిపే సమయం

## బీచ్‌లో సిస్టర్స్ ముద్దు రచ్చ రచ్చ



టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. గత రెండు మూడు సంవత్సరాలుగా కాజల్ సినిమాలు తగ్గాయి, కానీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత కూడా ముందులా నటించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టాలీవుడ్‌లో ఆమెకు మునుపటి మాదిరిగా సినిమా ఆఫర్లు రావడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ఉన్న గౌరవం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా కాజల్ చేసిన ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్ అనే విషయం తెల్సిందే. ఇటీవల మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప' సినిమాలోనూ అత్యంత కీలకమైన పార్వతిదేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో లీడ్ రోల్స్ కాకుండా ఇలా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ వస్తున్న కాజల్ అగర్వాల్ ఛాన్స్ లభిస్తే లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించేందుకు, యాక్షన్ సీన్స్ కు కూడా రెడీ అన్నట్లుగా చెప్పుకొచ్చింది. హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పటికి అదే అందం, అదే ఫిజిక్‌తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. తాజాగా మరోసారి కాజల్ అగర్వాల్ ఫోటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ఈసారి ఆమె సిస్టర్ నిషా అగర్వాల్‌తో ఉన్న ఫోటోలు కావడంతో పాటు బీచ్‌లో బికినీలో ఉండటంతో మరింతగా చూపు ఆకర్షిస్తున్నాయి. కాజల్ అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ట్రిప్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా నిషా అగర్వాల్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. కాజల్ అగర్వాల్‌కి బీచ్‌లో కూర్చుని ముద్దు పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు సిస్టర్స్ బీచ్‌లో బికినీలో ఉన్నారు. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో బికినీలో ఉంటే చూపు తిప్పడం కష్టం. అలాంటిది ఇద్దరు సిస్టర్స్ బికినీలో ఉండటంతో చూపు తిప్పలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ మాత్రమే కాకుండా నిషా అగర్వాల్ కూడా చాలా అందంగా ఉందని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి. సముద్రంలో వీరిద్దరూ సరదాగా తీసుకున్న ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ కావడంతో నిషా అగర్వాల్‌కి అదృష్టం కలిసి రాలేదు కానీ, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం దక్కి ఉంటే తప్పకుండా పెద్ద హీరోయిన్‌గా పేరు దక్కించుకుని ఉండేది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిషా అగర్వాల్ పలు సినిమాల్లో నటించినప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో హిట్ పడలేదు. దాంతో అక్క కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలో స్థిర పడింది. ఇప్పుడు చెల్లితో పాటు అక్క కాజల్ అగర్వాల్ కూడా సంసార జీవితంలో స్థిర పడింది. వీరిని ఇలా చూసిన వారు చాలా మంది ఇద్దరు కలిసి ఏదైనా ఒక సినిమాలో నటిస్తే బాగుండేది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

## మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న అల్లరి నరేష్.. ఫస్ట్ లుక్ అదుర్స్




టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్ .అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టిన రోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగిపోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు. ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## దిల్ రాజు భార్య పెద్ద చదువులే చదివింది.. పెళ్లయ్యాక కూడా



దిల్ రాజు ఇండస్ట్రీలోని టాప్ ప్రొడ్యూసర్స్‌లో ఒకరు అనే విషయం తెలిసిందే. ఆయన పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ ఇండస్ట్రీకి మంచి హిట్స్ అందించాడు. ఇటీవల దిల్ రాజు డ్రీమ్స్ అనే వెబ్ సైట్‌ని లాంచ్ చేశాడు. పరిశ్రమకు పరిచయం కావాలనుకునేవారికి ఇది సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో ఈ 'దిల్‌రాజు డ్రీమ్స్' అనే వెబ్‌సైట్‌ని స్టార్ట్ చేశాం అని దిల్‌రాజు తెలిపారు. అయితే దిల్ రాజు పర్సనల్ లైఫ్ ఒకసారి చూస్తే అతని భార్య అనిత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో కన్నుమూసింది. కొద్ది రోజుల తర్వాత తేజస్విని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ హాట్ టాపిక్‌గా మారుతుంది. దిల్ రాజు భార్య తేజస్విని గతంతో పోల్చితే తన వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తిపరమైన విషయాలల్లోనూ ఓపెన్‌గా మాట్లాడుతూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా మారింది. ఇటీవల భర్తతో కలిసి పారిస్‌కి వెకేషన్‌కి వెళ్లిన సందర్భంగా అక్కడి ఫోటోలు తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసి నెటిజన్లను ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా, పెళ్లి తర్వాత తొలిసారి ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తేజస్విని తన చదువు, కెరీర్, ప్రేమ, పెళ్లి వంటి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకుంది. "హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. నా విద్యాభ్యాసం మొత్తం గర్ల్స్ ఇన్‌స్టిట్యూషన్లలోనే సాగింది. స్కూలింగ్ సెయింట్ ఆన్స్‌లో, ఇంటర్ శ్రీ చైతన్యలో పూర్తయ్యింది.

## ఆ తప్పు చేస్తే అంతే సంగతులు.. బీసీసీఐకి ఏబీడీ స్ట్రాంగ్ వార్నింగ్!



**న్యూఢిల్లీ-నవభూమి:** పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో ఆ తప్పు చేయొద్దని అంటున్నాడు ఏబీ డివిలియర్స్. అతడి వర్క్ లోడ్ విషయంలో నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి, పదిసార్లు ఆలోచించుకోవాలని చెబుతున్నాడు. దీనికి బుమ్రా విషయంలో భారత క్రికెట్ బోర్డు, టీమ్ మేనేజ్‌మెంట్ భయపడుతుండటమే కారణం. ఇంగ్లండ్ సిరీస్‌లో ఈ స్పీడ్‌స్టర్ 3 టెస్టులే ఆడతాడని, అన్ని మ్యాచులు ఆడడని అటు నుంచి బీసీసీఐ, ఇటు నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ చెబుతుండటంపై ఏబీడీ సీరియస్ అయ్యాడు.

నో రెస్ట్..'బుమ్రా దునియాలోనే నంబర్ వన్ బౌలర్. 5 టెస్టుల సిరీస్‌లో కేవలం మూడు మ్యాచుల్లోనే అతడ్ని ఆడించాలని అనుకోవడం సరైన నిర్ణయం కాదు. అతడ్ని పూర్తి సిరీస్‌లో ఆడించాలి. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ పేరుతో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలనుకోవడం సరికాదు. ఆ తప్పు అస్సలు చేయొద్దు. ఒకవేళ ఈ పేసర్‌కు రెస్ట్ ఇవ్వాలని అనుకుంటే వన్డేలు, టీ20ల్లో ఆడించొద్దు. అంతేగానీ టెస్టుల్లో మాత్రం అతడి సేవల్ని పూర్తిగా వాడుకోవాలి' అని ఓ యూట్యూబ్ చానల్‌తో చెప్పుకొచ్చాడు ఏబీడీ.

స్టెయిన్ ఫార్ములా..సౌతాఫ్రికా టీమ్‌కు తాను కెప్టెన్‌గా ఉన్నప్పుడు డేల్ స్టెయిన్ వర్క్ లోడ్ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నామని డివిలియర్స్ అన్నాడు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి లాంటి బడా జట్లతో జరిగే టెస్ట్ సిరీస్‌ల్లోనే అతడ్ని ఆడించేవాళ్లమని గుర్తుచేశాడు ఏబీడీ. టీ20, వన్డే మ్యాచుల్లో స్టెయిన్‌కు రెస్ట్ ఇచ్చేవాళ్లమని తెలిపాడు. టీమిండియా కూడా బుమ్రా విషయంలో ఇలాగే వ్యవహరించాలని.. అతడ్ని సేవల్ని సమర్థంగా, జాగ్రత్తగా వాడుకోవాలని డివిలియర్స్ సూచించాడు.

## గిల్ సేనను శనిలా తగులుకున్నాడు.. 3-ఫార్మాట్ స్టార్‌తో కష్టమే!



**న్యూఢిల్లీ-నవభూమి:** లీడ్స్ టెస్ట్ పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న భారత్.. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో చెలరేగి ఆడాలని అనుకుంటోంది. రెండో టెస్ట్‌లో నెగ్గి సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉంది గిల్ సేన. బ్యాటింగ్‌తో పాటు ఈసారి బౌలింగ్‌లోనూ తడాఖా చూపించాలని భావిస్తోంది. ఆతిథ్య జట్టు బ్యాటర్ల బెండు తీయాలని చూస్తోంది. అందులో భాగంగా పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రా నేతృత్వంలో బౌలర్ల బృందం నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చుతోంది. అయితే ఓ బ్యాటర్ మాత్రం భారత జట్టును ఊపిరి సలపకుండా చేస్తున్నాడు. బౌలింగ్ వేయాలంటే భయపడేలా చేస్తున్నాడు. టీమిండియాకు శనిలా దాపురించిన ఆ ఆటగాడు ఎవరు అనేది ఇప్పుడు చూద్దాం..ఓడించాడు..ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ బెన్ డకెట్ భారత జట్టును భయపెడుతున్నాడు. లీడ్స్ టెస్ట్‌లో టీమిండియా ఓటమికి అతడే ప్రధాన కారణమని చెప్పాలి. ఆ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 62 పరుగులు చేసిన డకెట్.. రెండో ఇన్నింగ్స్‌లో 149 పరుగుల సూపర్బ్ నాక్‌తో మ్యాచ్‌ను ఇంగ్లండ్ వైపు తిప్పేశాడు. అతడ్ని గానీ ముందే ఔట్ చేసి ఉంటే మ్యాచ్‌లో రిజల్ట్ మరోలా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మ్యాచ్ అనే కాదు.. సాధారణంగానే భారత్‌పై డకెట్‌కు మంచి రికార్డులు ఉన్నాయి.

## హైదరాబాద్ హీరోస్‌కు మూడో స్థానం



**ముంబై- నవభూమి:** ఆరంభ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌బీఎల్)లో హైదరాబాద్ హీరోస్ మూడోస్థానంతో సరిపెట్టుకుంది. ఆదివారం ముంబైలోని అంధేరి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్.. 17-12తో బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌ను ఓడించింది. టైటిల్ పోరులో చెన్నై బుల్స్.. 41-0తో ఢిల్లీ రెడ్జ్‌పై విజయదుందుభి మోగించి తొలి ట్రోఫీని ముద్దాడింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**